www.vishalabharati.com
epaper:vishalabharati.com
బుధవారం, హైదరాబాద్
02.10.2024
సంపుటి:2 సంచిక:340

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



## బతుకమ్మ..బతుకమ్మ.. ఉయ్యాలో

- సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక
- తీరొక్క పూల విశేషాల సమాహారం
- నేటి నుంచే ప్రారంభం కానున్న ఉత్సవాలు

### ఆడబిడ్డలకు బతుకమ్మ శుభాకాంక్షలు

- సీఎం రేవంత్ రెడ్డి

### తరతరాల మహిళా సామూహిక శక్తి బతుకమ్మ

- మాజీ సీఎం కేసీఆర్

..మిగతా 2 లో



# మూసీమే లూటో.. ఢిల్లీ మే బాంటో

## ఇదే కాంగ్రెస్ పార్టీ విధానం

- గరీబోళ్లంతా కాంగ్రెస్ కు వ్యతిరేకం
- వాళ్ల బతుకులు ఆగం చేయాలని చూస్తున్న రేవంత్
- మీ ఇండ్లమీదకు బుల్డోజర్ వస్తే కంచె అడ్డ పెట్టండి
- మూసీ పరివాహకంలో ఉన్నోళ్లను అడవులకు పంపుతారా?
- ప్రజలు తమ హక్కులు తెలుసుకోవాలి?
- సోనియమ్మ ఇండ్లు కూలగొట్టాలని చెప్పిందా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సర్వే, కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఇండ్లు కూల్చుతరోనని ప్రజలు ఆవేదనలో ఉన్నారని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక పరిధి తులసీరామ్ నగర్‌లో మూసీ ప్రాంత వాసులను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డితో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం పగపట్టారన్నారు. గరీబోళ్లంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నరని, వాళ్ల బతుకులను ఆగం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. మూసీమే లూటో.. దిల్లీ మే బాంటో అనేది కాంగ్రెస్ నినాదమని విమర్శించారు. మీ ఇండ్ల మీదకు బుల్డోజర్ వస్తే కంచె అడ్డుపెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి కాదు.. ఆయన తాత వచ్చినా ఏమీ చేయలేరన్నారు.**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర బడ్జెట్ లో సగం డబ్బులతో మూసీ ప్రక్షాళన చేపట్టారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత వాసులను అడవిలోకి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కడతామంటూ కూల్చుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడపలుక్కున్నారా? అని అడిగారు. పేదలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే దేవుడని అన్నారు. రేవంత్ రెడ్డి నీవు మొగోడివైతే నీవు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బ్రోకర్లు విడగొట్టే ప్రయత్నం చేస్తారని, మన హక్కులను లాక్కునే హక్కు ఎవరికీ లేదన్నారు. మీకోసం బీఆర్ఎస్ తరఫున కోర్టులో కొట్లాడుతామని భరోసానిచ్చారు కేటీఆర్. 'తెలంగాణల పెద్ద పండుగ అంటే దసరా. కానీ హైదరాబాద్‌లో లక్షలాది మంది పేదలకు నిద్రలేకుండా చేసిండ్రు. ఎప్పుడు ఇండ్లు కూలగొడుతరో, ఎప్పుడు తమ ఇంటి మీదికి బుల్డోజర్ పంపుతరో అన్నట్టు భయపడుతున్నరు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన

..మిగతా 3 లో

# కేటీఆర్.. మూసీపై చర్చకు సిద్ధమా?

- పేదలను ఎందుకు రెచ్చగొడుతున్నారు?
- మూసీని ప్యూరిఫైర్ రివర్ గా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- కాళేశ్వరం ఓ తుగ్లక్ ప్రాజెక్ట్
- మల్లన్నసాగర్ నిర్వాసితులను మీరు ఎలా డీల్ చేశారో తెలియదా?
- సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్ కే గోదావరి జలాలు రావాలా?
- నల్లగొండకు మంచి నీళ్లు రావడం మీకు ఇష్టం లేదా?
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



..మిగతా 2 లో



## పేద, ధనిక అనే తేడా లేదు

### ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

- పైలట్ ప్రాజెక్టు పర్యవేక్షణకు ఆర్డీవో స్థాయి ప్రత్యేక అధికారులు
- ఎల్ఆర్ఎస్ ను వేగవంతం చేయాలి
- దసరా లోపు లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు
- యూడిఏ పరిధి పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలుకు వేరువేరుగా కేంద్రాలు
- యుద్ధ ప్రాతిపదికన వరద ప్రాంతాలలో మరమత్తులు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్లతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

..మిగతా 2 లో



## డేరా బాబాకి బెయిల్

- హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ బయటకు
- నాలుగేళ్లల్లో 15 సార్లు పెరోల్
- సెప్టెంబర్ 2న తిరిగి సునరియా జైలుకు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

ఇద్దరు మహిళా భక్తులపై అత్యాచారానికి పాల్పడిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా నేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ మరోసారి జైలు నుంచి బయటకు

..మిగతా 2 లో

# హోంగార్డులంటే లెక్కలేదా?

- ఇష్టారాజ్యంగా కూల్చివేతలు చేపడతారా?
- కూల్చివేతల్లో గాయపడ్డ హోంగార్డును పరామర్శించరా?
- అతడి చికిత్సకు రూ. లక్ష ఖర్చు అయ్యింది
- ఈ మొత్తం ఎవరు కట్టాలి?
- డిటోనేటర్లతో పేలుళ్లు చేసినప్పుడు జాగ్రత్తలు పాటించరా?
- మాజీ మంత్రి హరీశ్ రావు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

హోంగార్డులు అంటే ప్రభుత్వానికి ఇంత చిన్న చూపా? హైడ్రా కూల్చివేతల సమయంలో గాయపడిన వారిని అధికారులు కనీసం పరామర్శించకపోవడం దారుణమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ చెరువులో నిర్మించిన కట్టడాలను హైడ్రా కూల్చివేతలో క్రమంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను హరీశ్ రావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రమాదం జరిగి ఇన్ని రోజులైనా

..మిగతా 2 లో



## సీఎం రేవంత్ రెడ్డి గడువు ముగిసింది

- ఇంటికి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది
- బీజేపీ 24 గంటల రైతు హామీల సాధన దీక్ష విరమణ
- నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన
- రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ అభయ్ పాటిల్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వేదికగా బీజేపీ ప్రజా ప్రతినిధులు చేపట్టిన 24 గంటల రైతు హామీల సాధన దీక్ష ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన 8 హామీలైన రైతు రుణమాఫీ, రైతుబీమా, రైతు భరోసా, కౌలు రైతులు, కూలీలు, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అంశాలపై సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన దీక్షను

..మిగతా 2 లో

# కొత్త భక్తుడికి పంగనామాలు ఎక్కువ



- రాజకీయాలు ఇక చాలు
- జనం మీద దృష్టి పెట్టండి
- ప్రకాశ్ రాజ్ సంచలన ట్వీట్
- సుప్రీంకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని తప్పుపట్టింది కదా..
- ప్రకాశ్ రాజ్ ట్వీట్ వైరల్..
- పవన్ కల్యాణ్ ను ఉద్దేశించే పెట్టారా?



**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:**

తిరుమలలో లడ్డూ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వేళ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నటుడు ప్రకాష్ రాజ్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ అంశంపై ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలను పవన్ కల్యాణ్ తప్పుపట్టిన వేళ.. ప్రకాశ్ రాజ్ సైతం దీనిపై అభ్యంతరం తెలుపుతూ ఓ వీడియో విడుదల చేశారు. లడ్డూ వ్యవహారానికి సంబంధించి సోమవారం సుప్రీంకోర్టు ఏపీ ప్రభుత్వ తీరును తప్పుపట్టిందంటూ ఓ న్యూస్ క్లిప్‌ను సైతం ట్వీట్ చేశారు. 'దేవున్ని రాజకీయాల్లోకి లాగకండి.. జస్ట్ ఆస్కింగ్' అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు. తాజాగా, ప్రకాశ్ రాజ్ మరో ట్వీట్ చేశారు. 'కొత్త భక్తుడికి పంగనామాలెక్కువ!.. కదా.?. ఇక చాలు ప్రజల కోసం చెయ్యాల్సిన పనులు చూడండి.' అంటూ మరో సంచలన ట్వీట్ చేయగా వైరల్ అవుతోంది. ఇది పవన్‌పై

..మిగతా 2 లో



..మిగతా 2 లో

## హరీశ్.. రెండ్రోజుల్లో నీ ఫామ్ హౌస్‌కు వస్తున్నా

- చెరువులో నువ్వు కట్టుకున్నావు
- రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్ట్ నుంచి హరీశ్ భూములు తప్పించారు
- షాద్ నగర్ లో హరీశ్ రావుకు 70 ఎకరాలు భూమి ఉంది
- ఇప్పుడు ఆ భూముల గుండా ఆర్ఆర్ఆర్ పోవాలి
- లేదంటే రేవంత్ ఇంటి ముందు ధర్నా చేస్తా
- మూసీ నది క్లీన్ చేస్తే హైదరాబాద్ కు ఎంతో లాభం
- అక్రమ కట్టడాలు కూల్చేస్తానని కేసీఆర్ అనలేదా?
- కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు



# సీఎం రేవంత్ రెడ్డి గడువు ముగిసింది

**మొదటిపేజీ తరువాయి**

మంగళవారం ఉదయం 11 గంటలకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ అభయ్ పాటిల్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. రైతు హామీల సాధన దీక్ష స్థలి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్లపై బీజేపీ ప్రజాప్రతినిధులు నిప్పులు చెరిగారు. రానున్న రోజుల్లో ఇలాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వంపై పోరాటాలు చేయాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ అభయ్ పాటిల్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమస్యను వెతకాల్సిన అవసరం లేదని, అధికార పార్టీ వాళ్లే అనేక సమస్యలు సృష్టించి మనకు ఇస్తున్నారన్నారు.
రేవంత్ రెడ్డి ఎవ్వరి మాట వినడం లేదని, ఎవరి మాట వినని వాడు సైకో అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైకోర్టు వేసిన మొట్టికాయలు నేరుగా రేవంత్ రెడ్డికి తగిలాయని, చట్టం మీద గౌరవం ఉంటే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆరాచకపాలన నడుస్తోందని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజినిలా ప్రవర్తిస్తూ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అన్ని సామాజిక వర్గాలను మోసం చేశారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి దిల్లీ టూ తెలంగాణకు చక్కర్లు కొడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి దిల్లీలో కప్పం కట్టేందుకు పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణకు ముఖ్యమంత్రినా? దిల్లీకి కప్పం కట్టే మంత్రినా అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన జేబులు నింపుకోవడానికే తప్ప మరొకటి లేదన్నారు. కాంగ్రెస్ చరిత్రంతా అవినీతేనన్నారు. కేంద్ర ప్రభుత్వంపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

# పేద, ధనిక అనే తేడా లేదు

## ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

పేద, మధ్య, ధనిక వర్గాలు, కుటుంబాలు అనే తేడా లేకుండా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబం హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, యూనిక్ నెంబర్ తో స్మార్ట్ కార్డు ఇవ్వడమే ఫ్యామిలీ కార్డు ప్రధాన ఉద్ధేశ్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వీలైనంత మేరకు వారికి మేలు చేయాలన్న సంకల్పంతోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డును తీసుకొస్తున్నామని వెల్లడించారు.
అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ కార్డులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, వాస్తవానికి దగ్గరగా జాగ్రత్తగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.
తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుండి మంగళవారం నాడు చీఫ్ సెక్రెటరీ శ్రీమతి శాంతి కుమారి తో కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటి (యూడిఏ), ఎల్ఆర్ఎస్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ధాన్యం కొనుగోళ్ళు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ల తో మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ
తెలంగాణ ఫ్యామిలి డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాలలోని 238 ప్రాంతాలలో పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నామని ఇప్పటికే ఈ ప్రాంతాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని, ఒకవేళ పూర్తిగా పట్టణ / నగర నియోజకవర్గాలైతే రెండు వార్డులు / డివిజన్లు ఎంచుకోవాలని సూచించారు. ఈ నెల మూడవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు ఎంపిక చేసిన ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో (డోర్‌టుడోర్) వివరాలను పకడ్బందీగా సేకరించాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు గాను ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి, జోనల్ కమిషనర్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే మండలానికి ఒక తహశీల్దారును కూడా నియమిస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులు చేర్పుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ కార్డుల విధానం, అమలు వాటి ఫలితాలపై తెలంగాణ అధికారుల బృందం మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, కర్ణాటక, హర్యానా రాష్ట్రాలలో పర్యటించి ముఖ్యమంత్రి గారితో పాటు క్యాబినెట్ సబ్‌కమిటీకి నివేదిక అందజేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి గారు దీనిపై సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని దానికి అనుగుణంగానే పైలట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నామని ఈ నెల మూడవ తేదీన ఈ పైలట్ ప్రాజెక్టు ముఖ్యమంత్రి గారు ప్రారంభిస్తారని వెల్లడించారు.
ఈ పైలట్ ప్రాజెక్టులో ఎదురయ్యే మంచి చెడులను, పరిగణనలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అమలు అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

**ఎల్ఆర్ఎస్ :**

గత నాలుగు సంవత్సరాలనుంచి లక్షలాది మంది ఎల్ఆర్ఎస్ కోసం ఎదురు చూస్తున్నారని, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా యుద్ధ ప్రతిపాదికన దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో జరగడం లేదని, కొన్ని జిల్లాల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు ఉంటే పదుల సంఖ్యలో పరిష్కరించడం పట్ల మంత్రిగారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

**అర్బన్ డెవలప్మెంట్ అథారిటి (యూడిఏ):**

అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (యూడిఏ)ల పరిధి పెంపు, కొత్త యూడిఏల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే కలెక్టర్లు పంపించాలని ఆదేశించారు.

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు:**

గత ప్రభుత్వం ఎంతో గొప్పగా ఆర్భాటంగా ప్రకటించి అరకొరగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించిందని, ఇందులో కొన్ని మాత్రమే పూర్తి అయ్యాయని, ఈ పూర్తి అయిన ఇండ్లకు లబ్దిదారులను ఎంపిక చేసి దసరా లోపు వారికి అప్పగించాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఇందుకోసం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఛైర్మన్ గా, జిల్లా కలెక్టర్ కన్వీనర్ గా మరికొంతమంది సభ్యులతో కమిటీ ని ఏర్పాటు చేస్తామన్నారు.

**వరద సహాయం :**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రప్రభుత్వం 29 జిల్లాలకు, ఒక్కో జిల్లాకు మూడు కోట్ల రూపాయల చొప్పున, ఖమ్మం, సూర్యపేట, కొత్తగూడెం, మహబూబాబాద్ నాలుగు జిల్లాలకు ఒక్కో జిల్లాకు ఐదు కోట్ల రూపాయల చొప్పున, మున్సిపాలిటీలకు కోటి రూపాయలు, కార్పొరేషన్లకు రెండు కోట్ల రూపాయల చొప్పున కేటాయించడం జరిగిందని, వరదలకు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే మరమత్తులు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అంగన్ వాడీ కేంద్రాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి మరమత్తులు చేపట్టాలన్నారు.

**ధాన్యం కొనుగోలు :**

తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 35 సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఈ ఖరీఫ్ సీజన్ నుంచే అందిస్తున్నామని మంత్రిగారు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కోసం రాష్ట్రవ్యాప్తంగా 7144 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, సన్న ధాన్యానికి దొడ్డు ధాన్యానికి వేరు వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు సన్నరకాలు 30 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం వస్తుందని అంచనా వేస్తూ దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.
రైతాంగానికి ఏ చిన్న సమస్య కూడా రాకుండా కొనుగోళ్లను ప్రక్రియను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐటిల పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీ.ఎస్. చౌహాన్, పంచాయత్ రాజ్ కార్యదర్శి లోకేశ్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హౌసింగ్ కార్యదర్శి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డులంటే లెక్కలేదా?

**మొదటిపేజీ తరువాయి**

ఒక్క పోలీస్ ఉన్నతాధికారి కూడా వచ్చి పరామర్శించలేదు. హోం గార్డులు అంటే అంత చులకనా? అని ప్రశ్నించారు.ఇప్పటి వరకు హోం గార్డు గోపాల్ కుటుంబం చికిత్సకి లక్ష రూపాయలు ఖర్చు చేశారు. ప్రభుత్వం వైద్య ఖర్చులు భరించడం లేదు. ప్రభుత్వం నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని కుటుంబసభ్యులు వాపోతున్నారు. నాలుగు నెలల నుంచి జీతం రాక, ఇటు వైద్య ఖర్చులు భరించలేక పోతున్నాం అని కుటుం బ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తురని తెలిపారు. తలకు దెబ్బ తగిలి మాట పడిపోయింది. పూర్తిగా మాటలు రావడానికి నాలుగు నెలల పాటు స్పీచ్ థెరపీ అందించాలని డాక్టర్లు చెప్తున్నారు. ప్రమాదకరమైన డిటోనేటర్లతో పేలుళ్లు చేసినప్పుడు కనీస జాగ్రత్తలు పాటించక పోవడం వల్లే గోపాల్ ప్రమాదానికి గురయ్యారని విమర్శించారు.
ఈ ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేయకుండా గోపాల్‌ని, గోపాల్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గోపాల్‌కి పూర్తిగా నయం అయ్యేంత వరకు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలని, అలాగే గోపాల్‌కి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సు దర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# కేటీఆర్.. మూసీపై చర్చకు సిద్ధమా?

- పేదలను ఎందుకు రెచ్చ గొడుతున్నారా?
- మూసీని ప్యూరిఫైర్ రివర్ గా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- కాళేశ్వరం ఓ తుగ్లక్ ప్రాజెక్ట్
- మల్లన్నసాగర్ నిర్వాసితులను మీరు ఎలా డీల్ చేశారో తెలియదా?
- సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్ కే గోదావరి జలాలు రావాలా?
- నల్లగొండకు మంచి నీళ్లు రావడం మీకు ఇష్టం లేదా?
- మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్‌పై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణలో ప్రతిపక్షాలకు మానవత్వం లేదని మండిపడ్డారు. మూసీ నది విషయంలో ప్రజలను ఎందుకు రెచ్చగొడుతున్నారని ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం రోజున మీడియాతో మాట్లాడుతూ.. మూసీలో పారేది విషపు నీరు అని అన్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటే ప్రత్యక్ష ఉద్యమం చేస్తామని చెప్పారు. నల్లగొండ జిల్లా గ్రౌండ్ వాటర్‌లో ఫ్లోరెడ్ ఎక్కువని.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మూసీ పరిస్థితి మారుతుందని అనుకున్నామని.. అయితే అలా జరగలేదని విమర్శించారు. మూసీ కోసం కేటీఆర్ వెయ్యి కోట్ల రూపాయలు అప్పు తెచ్చారని, మూసీ డెవలప్‌మెంట్ బోర్డు అన్నారని.. మూసీ ప్రక్షాళన చేస్తే కమిషన్ రాదని మొదలుపెట్టలేదా? అని ప్రశ్నించారు. మూసీని ప్యూరిఫైర్ రివర్‌గా మార్చాలని ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతిపక్షాలకు కనీసం మానవత్వం లేదని.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు వచ్చి మూసీ ప్రక్షాళనపై మాట్లాడాలని మంత్రి కోమటిరెడ్డి కోరారు. కేసీఆర్, కేటీఆర్ నాయకులు కాదని.. రాజకీయ నాయకులే అంటూ సెటైర్లు వేశారు. కాళేశ్వరం ఒక తుగ్లక్ పని అని విమర్శించారు. మల్లన్న సాగర్ నిర్వాసితులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిందో అందరం చూశామని అన్నారు. మూసీ అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి కోరారు. తాను నల్గొండ వ్యక్తిగా, మూసీ బాధితుడిగా మాట్లాడుతున్నానని చెప్పారు. సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్ వాళ్లు గోదావరి జలాలతో సంతోషంగా ఉండాలి.. నల్గొండ ప్రజలు మాత్రం మూసీ మురికితో చావాలా? అని ప్రశ్నించారు. మూసీ నీళ్లను అమెరికా తీసుకెళ్ళి టెస్ట్ చేయించాలని అన్నారు. ప్రతిపక్ష నేతలు నల్గొండ వచ్చినా, వయా నల్గొండ వెళ్ళినా అక్కడి ప్రజలు వారికి బుద్ధి చెప్తారని అన్నారు. నల్గొండలో మీ బంధువులు లేరా? నల్గొండపై ఎందుకు కక్ష కట్టారు? అని ప్రశ్నించారు. మూసీ వల్ల కలిగే ఇబ్బంది తెలుసుకుంటే జర్నలిస్టులు వెళ్లి కేసీఆర్‌ను కొడుతారని అన్నారు. మూసీపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్దామా అంటూ బీఆర్ఎస్‌కు మంత్రి కోమటిరెడ్డి సవాల్ విసిరారు. "బస్సు పెడుతాను.. నేను మీతో పాటే వస్తా.. మూసీ విషయంలో ప్రజలను ఎందుకు రెచ్చగొడుతున్నారు. తిన్నది అరగడం లేదా కేటీఆర్, హరీష్. దోచుకున్న పైసలతో ఏదైనా బిజినెస్ చేసుకోండి. ప్రజలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు. నేను 25 ఏళ్ల కింద మూసీ నది కోసం దీక్ష చేశాను. అప్పుడు నా దీక్షకు ప్రొఫెసర్ జయశంకర్ మద్దతు తెలిపారు" అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.



# బతుకమ్మ..బతుకమ్మ.. ఉయ్యాలో

**భీమదేవరపల్లి,విశాలభారతి :**


పట్టు చీరలతో మహిళా మణులు, పట్టు పరికిణీలతో తెలుగింటి ఆడపడుచులు ఎటు చూసినా రంగురంగుల పూలు, అడుగడుగునా సం ప్రదాయం వట్టిపడే విధంగా ఉత్సవాలు జరుగనున్నాయి. ఆటా పాటలతో సందడి ప్రతీ ఏటా కనిపించే బంగారు బతుకమ్మ వరవడి తెలంగాణ సంప్రదాయా నికి, జీవనస్థితి గతులకు అద్దంపడుతుంది. దసరా పండుగకు ముందు అలరించే ఈ బతుకమ్మ మన రాష్ట్రంలో మరింత ప్రాధాన్యత సంతరించు కుంది. ఎంగిలి పువ్వుతో మొదలై, సద్దుల బతుక మ్మతో ఈ వేడుకలు ముగియనున్నాయి. ఈ ఉత్సవాలు నేటి నుంచే ప్రారంభం కానున్నాయి.

**పూల గుమగుమలు...**

బతుకమ్మ అంటేనే పూల పండుగని చెబుతారు. ఈ వేడుకలు వచ్చాయంటే చాలు అన్ని ప్రాంతాలు పూల గుమగుమలతో కళకళలాడుతాయి. తంగేడు, గునుగు, తామర, గుమ్మడి, బంతి,ఛామంతి లాంటి రకరకాల పూలను తీసుకొొచ్చి సర్వాంగ సుంద రంగా బతుకమ్మలను పేరుస్తారు. వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేస్తారు. ఆ పాటల్లోనే అమ్మవారిని భక్తిగా కొలుస్తారు.

**బతుకమ్మ కు పేర్లు**

బతుకమ్మకు సంబంధించి రకరకాల పేర్లు ఉన్నాయి. ఎంగిలిపూలని, అటుకుల, ముద్దపప్పు, నాని బియ్యం, ఆట్ల బతుకమ్మ, అలిగిన, వేపకాయల, వెన్నముద్దల, చివరిగా సద్దుల బతుకమ్మ లాంటి పేర్లతో తొమ్మిది రోజుల పాటు పూజలు, చేస్తారు. అమ్మవారికి రోజుకో నైవేద్యం సమర్పిస్తారు. నువ్వులు, బియ్యం పిండి, నూ కలపిండి కలిపిన ప్రసాదం, ముద్దపప్పు, పాలు, బెల్ల అట్లు దోసెలు, బియ్యంపిండి లడ్డూలు తదితర నైవేద్యాలను అమ్మవారికి సమర్పిస్తారు.



**పూలనే దేవతలుగా కొలవడం విశేషం**

ప్రకృతిని పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో ఏర్పడిన అన్ని పండుగల్లో కెల్లా బతుకమ్మ పండుగ ప్రత్యేకమైంది. మానవులు తమ ఉనికికి కారణమైన ప్రకృతిని గౌరవిస్తూ పూజిస్తూ వస్తున్నారు. పూలతో దేవున్ని కొలుస్తారు. పూలనే దేవతగా పూజించడం విశేషం.పొన్నాల హేమలత,మాజీ సర్పంచ్, కొత్తపల్లి గ్రామం



**నమ్మకాలకు దర్పణం..**

రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పే పండుగ బతుకమ్మ మహిళల ఆశయాలు, ఆశలకు, నమ్మకాలకు దర్పణంగా నిలుస్తుంది. ఈ ఉత్సవాల్లో పాడే పాటలు జన జీవనం నుంచి ఉద్భవించింది.

-మాజీ ఎంపీపీ జక్కుల అనిత,భీమదేవరపల్లి



**ప్రకృతిని ఆరాధించే పండుగ..**

ప్రతీ ఏడాది వచ్చే అన్ని పండుగల కన్నా బతుకమ్మ ఎంతో ప్రత్యేకమైంది. ప్రకృతిని ఆరాదించే అరుదైన అద్భుతమైన పండుగ ఇది,బతుకమ్మలో పేర్చే రంగురంగుల పూలన్నీ ఔషధగుణాలు కలిగినవి.

-దివ్య, ఎస్ ఐ వంగర

**ఆనవాయితీగా వస్తుంది..**


తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను భక్తితో కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఆర్థిక సమస్యలు, వ్యాపార, వ్యవసాయ సమస్యలు తీర్చాలని కోరుతూ అమ్మవారిని భక్తితో పూజించడం అనవాయితీగా వస్తుంది. ఇక ఆడపడుచుల విషయానికి వస్తే వివాహం జరగాలని, మంచి భర్త తమకు దొరకాలని కోరుకుంటూ ఈ బతుకమ్మను వేడుకుంటారు. వాడవాడలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి.

# తరతరాల మహిళా సామూహిక శక్తి బతుకమ్మ

- మాజీ సిఎం కేసీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ అస్తిత్వానికీ, సాంస్కృతిక జీవనానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని, పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ సంస్కృతీ సాంప్రదాయాల్లోనే ప్రత్యేకతను చాటుకుందన్నారు. తరతరాలుగా మహిళా సామూహిక శక్తికి, ఐక్యతకు దర్పణమైన బతుకమ్మ పండుగ, తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు. ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దులతో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ సందర్భంగా పల్లెలు పట్టణాలు అనే బేధం లేకుండా మహిళలతో పిల్లాపాపలతో ప్రత్యేక సందడి నెలకొంటుందని కేసీఆర్ గుర్తు చేశారు. బతుకమ్మ పండుగ విశిష్టతను ప్రాశస్త్యాన్ని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని గుర్తు చేశారు.



# హరీశ్.. రెండ్రోజుల్లో నీ ఫామ్ హౌస్ కు వస్తున్నా

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలోని మల్లన్న సాగర్ ముంపు బాధితులను కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావుపై మరోసారి ఆయన సంచలన కామెంట్స్ చేశారు. రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్ట్ నుంచి హరీష్ భూములు తప్పించారని ఆరోపించారు. షాద్‌నగర్ ప్రాంతంలో హరీష్ రావుకు భూములున్నాయని.. రెండు రోజుల్లో ఆ భూముల దగ్గరకు వెళ్తానని చెప్పారు. హరీష్ భూముల్లో నుంచి వెళ్లకపోతే.. సీఎం రేవంత్ ఇంటి ముందు ధర్నా చేస్తానని కీలక కామెంట్స్ చేశారు. ఇక మూసీ ఆక్రమణలపై స్పందించిన మైనంపల్లి.. మూసీ పక్కన ఉన్న పేదవాళ్లకు ప్రభుత్వం అండగా ఉంటదన్నారు. హైదారాబాద్‌లో అక్రమ కట్టడాలు కట్టితే నిర్ధాక్షణంగా కూల్చేస్తామని ఆనాడు కేసీఆరే అన్నారని గుర్తు చేశారు. మూసీ నది క్లీన్ చేయడం వల్ల ఎంతో లాభం ఉంటుందని చెప్పారు. కూల్చివేతలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలకు అవసరమయితే తన డబ్బు, తన భార్య పేరున ఉన్న డబ్బు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అందుకు కేసీఆర్, హరీష్ సిద్ధమా అని ప్రశ్నించారు. 'కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసేవాడు. వేల కోట్లు కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు వాడారు. హరీష్ రెండ్రోజుల్లో నీ ఫాంహౌస్‌కు వస్తున్నా. చెరువులో నీ ఫాంహౌస్‌ను కట్టుకున్నావ్. ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వంలో ల్యాండ్ గ్రాబరులుగా ఉన్నారు. హైడ్రా విషయంలో బీజేపీతో సహా అన్ని పార్టీలు సహకరించాలి. విజయవాడ మాదిరిగా హైదారాబాద్ కాకూడదు. కేసీఆర్ ఫాం హౌస్ నుంచి షాద్‌నగర్ వద్ద హరీష్‌కు ఉన్న 70 ఎకరాల నుంచి ఆర్ఆర్ఆర్ రోడ్డు పోవాలి.చెరువులో అన్నీ కబ్జా అయితే నీళ్లు ఎక్కడికి వెళ్ళాలి. పెన్షన్లు, రైతుబందు, డబుల్ బెడ్ రూంకు ఎన్ని ఇచ్చినా అంతా ప్రజల డబ్బే. ఇష్టారీతిన అనుమతులు ఇచ్చి హరీష్ రావు, కేటీఆర్‌లు లక్షల కోట్లకు చేరుకున్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి మొత్తం దోచుకున్నారు. కేసీఆర్, హరీష్ దమ్ముంటే మీ డబ్బులు సరెండర్ చేయండి. నేను నా ఆస్తులు సరెండర్ చేస్తా. మీ వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రాష్ట్రంలో ఇక ఉండేది కాంగ్రెస్, బీజేపీలు మాత్రమే. బీఆర్ఎస్ పనైపోయింది. హైడ్రా పరిస్థితి ఒక కొలిక్కి వచ్చాక మల్లన్న సాగర్ ముంపు బాధితుల సమస్యలను పరిష్కరిస్తాం.' అని మైనంపల్లి వ్యాఖ్యనించారు

# డేరా బాబాకి బెయిల్

**మొదటిపేజీ తరువాయి**

వస్తున్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన పెరోల్‌పై బయటకు వస్తుండడం విశేషంగా మారింది. పెరోల్ కోరుతూ ఆయన చేసుకున్న విజ్ఞప్తిని భారత ఎన్నికల కమిషన్ సోమవారం ఆమోదించింది. గత తొమ్మిది నెలల్లో ఆయన పెరోల్‌పై జైలు బయటకు రానుండటం ఇది మూడవసారి. కాగా నాలుగేళ్ల క్రితం దోషిగా తేలిన తర్వాత పెరోల్ పొందడం పదిహేనవది. అక్టోబర్ 5న హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా, గతంలోని మున్సిపల్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెరోల్‌పై డేరాబాబా విడుదలైన సందర్భాలున్నాయి. ఈసారి కూడా ఎన్నికలకు ఆయన విడుదలవుతున్నందున కొన్ని షరతులతో తాత్కాలిక విడుదలకు ఈసీ అంగీకరించింది.

# ఆడబిడ్డలకు బతుకమ్మ శుభాకాంక్షలు

- సిఎం రేవంత్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. ఈ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సాముహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనం అన్నారు. ఎంగిలిపూల నుంచి సద్దుల వరకూ అందరూ కలిసి పండుగను జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి కష్టాలను తొలగించాలని గౌరమ్మను సీఎం ప్రార్థించారు.



# కొత్త భక్తుడికి పంగనామాలు ఎక్కువ

**మొదటిపేజీ తరువాయి**

సెటైరికల్‌గానే వేశారనే విమర్శలు వస్తున్నాయి.

**ఇదీ జరిగింది**

కాగా, ఇటీవల తిరుమల లడ్డూ వివాదానికి సంబంధించి ఓ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నటుడు కార్తి 'అది సెన్సిటివ్ అంశం' అంటూ చేసిన వ్యాఖ్యలను పవన్ తప్పుబట్టారు. దీనిపై స్పందించిన కార్తి ట్విట్టర్ వేదికగా క్షమాపణలు చెప్పారు. దీనిపై ప్రకాష్ రాజ్ స్పందిస్తూ 'తప్పు చేయకుండానే క్షమాపణలు చెప్పించుకోవడంలో ఆనందం ఏంటో.?' అంటూ పవన్‌పై విమర్శలు గుప్పించారు. ఆ తర్వాత 'గెలిచే ముందు ఓ అవతారం.. గెలిచాక మరో అవతారం. ఏంటీ అవాంతరం.. ఎందుకీ అయోమయం.. ఏది నిజం' అంటూ మరో ట్వీట్ చేశారు. ఇలా వరుస ట్వీట్లతో ప్రకాష్ రాజ్ పవన్‌ను టార్గెట్ చేశారు. అయితే, దీనిపై జనసైనికులు, పవన్ అభిమానులు మండిపడుతున్నారు.

**తిరుమలకు పవన్ కల్యాణ్**

మరోవైపు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం సాయంత్రం అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు పయనమయ్యారు. లడ్డూ వివాదం క్రమంలో 11 రోజులు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఆయన.. బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం దీక్ష విరమించనున్నారు. అంతకు ముందు ఆయన ప్రాయశ్చిత్త దీక్ష, సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై మీడియాతో కీలక వ్యాఖ్యలు చేశారు. 0ప్రాయశ్చిత్త దీక్ష అనేది కేవలం లడ్డూ కోసం చేసిన దీక్ష మాత్రమే కాదని.. శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన దీక్ష అని అన్నారు. సనాతన పరిరక్షణ బోర్డు ఉండాలని కోరుకుంటున్నట్లు పవన్ చెప్పారు. 'కల్తీ నెయ్యికి సంబంధించి ఉన్న సమాచారాన్నే సీఎం చంద్రబాబు చెప్పారు. కల్తీ జరగలేదని సుప్రీంకోర్టు ఎక్కడా చెప్పలేదు. గత ఐదేళ్లలో అనేక తప్పిదాలు జరిగాయి. కొన్నేళ్లుగా 219 ఆలయాలు ధ్వంసం చేశారు. రామతీర్థం ఆలయంలో ధ్వంసం జరిగింది. ప్రభుత్వం అన్నింటిపైనా విచారణ జరిపిస్తుంది.' అని పవన్ పేర్కొన్నారు.

# హైదరాబాద్ లో డీజేలు బంద్

**– పోలీస్ శాఖ కీలక నిర్ణయం**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరంలో విపరీతమైన శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేలా పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఊరేగింపులు, వేడుకల సందర్భంగా శబ్ధ కాలుష్యానికి కారణమవుతోన్న డీజేలపై నిషేధం విధించింది. ఈ మేరకు నగర సీపీ సీవీ ఆనంద్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. డీజే సౌండ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని డయల్ 100కి ఫిర్యాదులు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. డీజేల అంశంపై ఇటీవల బంజారా హిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీపీ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, పాషా ఖాద్రీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, రాచకొండ సీపీ సుధీర్ బాబు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజేలపై నియంత్రణ అవసరాన్ని వివరిస్తూ సీపీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

**ఇవీ నిబంధనలు**

రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకూ డీజేలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతి ఉన్న ప్రాంతాల్లో తక్కువ శబ్దంతో అనుమతించనున్నారు. ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీలు, కోర్టు ప్రాంగణాలకు 100 మీటర్ల దూరంలో నిషేధాజ్ఞలు జారీ అయ్యాయి. సౌండ్ సిస్టం పరిమిత స్థాయిలో అనుమతిస్తామని.. దీనికి కూడా పోలీసుల అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. అలాగే, మతపరమైన ర్యాలీల్లో బాణాసంచా నిషేధమని తెలిపారు. మతపరమైన ర్యాలీలో ఎలాంటి డీజేను ఉపయోగించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**వనపర్తి, విశాల భారతి:** శంకర సముద్రం రిజర్వాయర్ ముంపు బాధితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు అందులో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం ఇవ్వాలని జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భూసేకరణ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శంకర సముద్రం ముంపు బాధితులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయడానికి చేయవలసిన భూసేకరణ, పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, దేవాలయాలు, తాగునీరు పాటశాల తదితర ఏర్పాట్లకు అవసరమైన ప్రతిపాదనకు, చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు పంచాయతీరాజ్ ఇంజనీర్లకు స్థలం అప్పగిస్తే నిర్మాణ పనులు చేపడతారని సూచించారు. ఇంకా ఎంత మందికి ప్లాట్లు ఇవ్వాల్సి ఉంటుంది, ఎంత మంది కి ఆర్థిక పరిహారం ఇవ్వాల్సి ఉంది అనేది పూర్తి నివేదికను త్వరగా సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా గణప సముద్రం, బుద్ధారం, మామిడి మాడ కాలువల భూసేకరణ ను వేగవంతం చేయాలని సూచించారు. అదనపు కలక్టర్ రెవెన్యూ యం నగేష్, ఆర్డీఓ పద్మావతి, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఈ. ఈ మల్లయ్య, తహసీల్దార్లు పాల్గొన్నారు .



## పదవి విరమణ పొందిన వీర జవాన్ కు సన్మానం

**ఆర్మూర్ విశాల భారతి:** నందిపేట మండలం చిమ్రాజు పల్లి గ్రామానికి చెందిన నన్నం హనుమంత్ 25 సంవత్సరాలుగా ఆర్మీలో పనిచేసి పదవి విరమణ పొందారు. మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ ప్రజలు ఆర్మీ జవాన్ కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పూలమాలతో సన్మానించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్మీలో దేశ సేవ చేసి సొంత గ్రామానికి పదవి విరమణ పొంది తొలిసారి రావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తోట రవి,తోట రాజేశ్వర్, సాకలి చిన్న రెడ్డి,నన్నం సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

## పినపాక తహసిల్దార్ గా అద్దంకి నరేష్



**పినపాక, విశాలభారతి:** నూతన తాసిల్దార్ గా అద్దంకి నరేష్ మంగళవారం నూతన బాధ్యతలు చేపట్టారు. నరేష్ భద్రాచలం ఐటిడిఏ ఏపీవోగా విధులు నిర్వహిస్తూ పినపాక తహసిల్దారు గా డిటి సమ్మయ్య నుండి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తోట సూర్యనారాయణ సస్పెండ్ కు గురైనారు. మండలంలో స్థానిక స్థితిగతులపై కార్యాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



## నేషనల్ అవార్డుకు అడుగు దూరంలో భూపాలపట్నం

- **గ్రామపంచాయతీ పరిశీలనకు వచ్చిన పంచాయతీ అడిషనల్ కమిషనర్ కృష్ణన్**
- **గిరిజన పద్ధతిలో స్వాగతం పలికిన ఎంపీడీవో, ఎంపీవో, మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్**
- **గ్రామంలో ఇంటింటికి తిరిగిన పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్**

**పినపాక, విశాలభారతి:** భూపాలపట్నం గ్రామపంచాయతీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పచ్చదనం పరిశుభ్రతపై నామినేట్ చేయబడిన ఏకైక పంచాయతీ. గత ఐదు సంవత్సరాల నుండి పంచాయతీని అభివృద్ధి చేయడంలో పంచాయతీ సర్పంచ్ కొర్స కృష్ణంరాజు, ఉపసర్పంచ్ నిటా వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు ఎంతగానో కృషి చేశారు. గ్రామంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తూ లెట్రిన్ దగ్గర నుండి రహదారుల నిర్మాణంలో తమదైన ముద్ర వేశారు. ఐదు సంవత్సరాల పదవి కాలం ముగియడంతో భూపాలపట్నం పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ గా పినపాక ఎంపిఓ వెంకటేశ్వరావు బాధ్యతలు చేపట్టారు. దానికి తోడు గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రకుమార్ గ్రామపంచాయతీకి తుది మెరుగులు దిద్దడంతో భూపాలపట్నం గ్రామపంచాయతీ నేషనల్ అవార్డుకు నామినేట్ చేయబడింది. దీంతో గ్రామపంచాయతీ లో ప్రతి పని ఎంపీఓ పర్యవేక్షణలో చేస్తూ జిల్లాలోని నేషనల్ అవార్డుకు ఎన్నిక అయ్యేందుకు సిద్ధమైంది. మంగళవారం రాష్ట్ర పంచాయతీ అడిషనల్ కమిషనర్ కృష్ణన్ గ్రామపంచాయతీని పరిశీలించేందుకు చేరుకున్నారు. పినపాక ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కృష్ణంరాజు, మాజీ ఉపసర్పంచ్ నిట్టా వెంకటేశ్వర్లు ఆయనకు గిరిజన సంప్రదాయ ప్రకారంలో ఘన స్వాగతం పలికారు. డోలు డప్పుల సంప్రదాయాలతో నూతన పంచాయతీ కార్యాలయానికి స్వాగతం పలికారు. తమ గ్రామ పంచాయతీని జాతీయస్థాయిలో తీసుకు వెళ్లేందుకు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఒకప్పుడు భూపాలపట్నం గ్రామపంచాయతీ పేరే తెలియని పరిస్థితి నుండి నేషనల్ అవార్డుకు ఎంపిక కాబడి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ స్థాయికి చేరుకోవడంలో పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు తనదైన ముద్ర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి సర్పంచ్ కృష్ణంరాజు, ఉప సర్పంచ్ నిట్ట వెంకటేశ్వర్లు సేవలు మరువలేని అని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి, కొన్ని లక్ష్యాలను ఏర్పరచుకొని గ్రామపంచాయతీని అభివృద్ధి బాటలో నడిపించారని తెలిపారు. గ్రామస్తుల సహకారాలు మరవలేనివని సర్పంచ్ కృష్ణంరాజు ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. జాతీయస్థాయిలో పంచాయతీకి గుర్తింపు రావడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## తెలంగాణ ప్రతీక బతుకమ్మ పండుగ

### అనూస్ అకాడమీ హై స్కూల్ కరస్పాండెంట్ అరుణారెడ్డి

**వనపర్తి, విశాల భారతి:** జిల్లా కేంద్రంలోని అనూస్ అకాడమీ హై స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనూస్ అకాడమీ హై స్కూల్ కరస్పాండెంట్ అరుణ రెడ్డి, వైస్ చైర్మన్ పార్వతి రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ అని.. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉంది అని అన్నారు. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆకృతులలో బతుకమ్మలు తయారు చేశారు. పలు ఆకారంలో చేసిన బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సరస్వతి బతుకమ్మ , గాజుల బతుకమ్మ ,గౌరీ బతుకమ్మ, పూసల బతుకమ్మ, వివిధ రూపాలలో తయారుచేసి విద్యార్థులు ఉపాధ్యాయ బృందం నృత్యాలు చేశారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





## ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఆర్మూర్ విశాల భారతి:** నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా బతుకమ్మ కార్యక్రమాన్ని ఉపాధ్యాయురాలు, విద్యార్థునిలు కలిసి నిర్వహించారు. బతుకమ్మను తయారు చేసి, తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి, అంగరంగ వైభవంగా విద్యార్థినిలు ఆటపాటలతో నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం క్రిష్ణ, సబిత, రాధా, శివాని, కిరణ్ కుమారి, ఉమాదేవి, శ్రీనిధి, సుమలత, మౌనిక ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## హైడ్రా పేరుతో పేదల ఇళ్ళను తొలగిస్తే ఊరుకోం

### సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

**సూర్యాపేట, విశాల భారతి :** హైడ్రా పేరుతో సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువు పక్కన ఉన్న ఇందిరా నగర్ పేదల ఇండ్లను కూలిస్తే చూస్తూ ఊరుకోమని, పేదలకు సిపిఎం పార్టీ అండగా ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. మంగళవారం సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 30 వ వార్డు ఇందిరా నగర్ లో పేదలను కలిసి వారికి సంఘీభావం ప్రకటించి ఆయన మాట్లాడుతూ హైడ్రా పేరుతో సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువు పక్కన ఉన్న పేదల ఇండ్ల వద్ద అధికారులు మార్కింగ్ చెయ్యడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గత 60, 70సంవత్సరాల క్రితం కొనుగోలు చేసుకుని ఇండ్లకు కరెంటు, నీళ్లు, డోర్ నెంబర్లు తీసుకొని జీవిస్తున్న పేద, మధ్యతరగతి ప్రజల జోలికి రావడం కరెక్ట్ కాదన్నారు. బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను కూల్చి వేస్తామని చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. తక్షమే అధికారులు పెట్టినమార్కింగ్ లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే ఈ చర్యలను ఉపసంహరించుకోవాలని లేనియెడల పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోసిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులునెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, చిన్నపంగానరసయ్య, సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్, సిపిఎం పట్టణ నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, షేక్ జహంగీర్,కోడి ఎల్లయ్య,ఉప్పుల రమేష్, కూసు బాలరాజ్ స్థానికులుపద్మ,కవిత,శివరాత్రిప్రమీల,సూరారపు పద్మ,సంధ్యతదితరులు పాల్గొన్నారు.



## ఎక్సెలెంట్ బాషా హై స్కూల్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### ముఖ్య అతిథులుగా ఏడూళ్ల బయ్యారం ఎస్సై రాజ్ కుమార్

పినపాక, విశాలభారతి: ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు లో గల ఎక్సెలెంట్ భాష హైస్కూల్ లో బతుకమ్మ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయుల నడుమ ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ బతుకమ్మ పాటలకు సాంప్రదాయ వస్త్రాలు ధరించిన విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి ఆడి పాడారు. విద్యార్థులు ఆటపాటలతో పాఠశాల పండగ వాతావరణంలా తయారైంది. విద్యార్థినులు, పాఠశాల ఆవరణం లో బతుకమ్మ పాటలకు కోలాటాలు, నృత్యాలు చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడూళ్ల బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల లో మంచి ప్రదర్శన కనబర్చాలని అన్నారు. అలాగే విద్యార్థులకు పండగల విశిష్టత గురించి తెలియజేస్తు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సెలెంట్ గ్రూప్స్ చైర్మన్ ఎండీ ఖాదర్, ఎండీ యాకుబ్ షరీఫ్, డైరెక్టర్స్ ముక్కు నర్సారెడ్డి, బండారు నరేంద్ర, ప్రిన్సిపాల్ అంకం సురేష్, సీనియర్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## మోద్దుల గూడెం పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

**కురవి ,విశాలభారతి:** మోద్దుల గూడెం జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాల వేడుకను నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా ప్రధానోపాధ్యాయులు ఎం సత్యనారాయణ చారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా పూలను పూజించే గోప్ప పండుగని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు శ్రీ రాములు, లత, దీపికా, సలీమ్, ఇందిర, వీరన్న, రజిత, భాగ్యలక్ష్మి, విష్ణు, టి.రమేష్, బి.రమేష్, వెంకన్న, లక్ష్మ, జహెద బేగం, అనితరాణి, తదితరులు పాల్గొన్నారు.

## మూసీమే లూఠో.. ఢిల్లీ మే బాంటో

మొదటిపేజీ తరువాయి

తర్వాత హైదరాబాద్‌లో పేదలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. మన హక్కులు మనం తెలుసుకున్నప్పుడు.. ఏ ప్రభుత్వం కూడా ఇష్టం వచ్చినట్లు మనమీదికి రాదు. రేవంత్ రెడ్డి అడ్డుమారిగుడ్డిగా ముఖ్యమంత్రి అయి పది నెలలు అయింది. హైదరాబాద్‌లో రేవంత్ రెడ్డి ఎవరూ ఓట్లు వేయలే. అందుకే ఇక్కడి ప్రజలపై పగబట్టిండు. పదినెల్ల ముందట ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ ఇంట్లో ఒక్కరికే పింఛన్ ఇస్తున్నాడని, తాను ముఖ్యమంత్రికాంగనే ముసలవ్వ, ముసలయ్యకు ఇద్దరికీ పెన్షన్ ఇస్తానని చెప్పిండు. కేసీఆర్ రూ.2 ఇస్తున్నడు, నేను రూ.4 వేలు ఇస్తా అన్నడు. అత్తకేమే రూ.4 వేలు, కోడలుంటే రూ.2500 ఇస్తానన్నడు. ఆరు గ్యారంటీలు అన్నడు. మరి ఒక్కరికన్న వచ్చినయా రూ.2500, రూ.4వేలు వచ్చినయా?. ఆడపడుచు పెండ్లికి రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తానడు.. కానీ తులం ఇనుమన్నా వచ్చిందా?. బంగారం రాదు. ఇనుము రాదు. మన్ను కూడా రాదు. ఇట్లా ఎన్ని కథలు చెప్పిండు.

రైతులకు రూ.15 వేలు ఇస్తానన్నడు. ఇచ్చిండా. ఆరు గ్యారంటీలు.. నూరు రోజులు అన్నడు. మూడొందల రోజులైంది. ఒక్కరికన్నా బుడ్డ పైసా అన్న వచ్చిందా. హామీలకు సంబంధి ఒక్క పైసా ఇవ్వలేదు. మూసీని రూ.లక్షా 50 వేల కోట్లతో సుందరీకరించి లండన్ లెక్క చేస్తాడట. ఇక్కడున్న పేదలను అడవిల పడేస్తాడట. మనమంతా చూస్తూ ఊరుకుందామా. ఇక్కడ 38 ఇండ్లకు ఆర్బీ ఎక్స్ అని రంగులు వేసిపోయింద్రట. పక్కింటికి రంగేసి పోతే నాకేంటని ఊకోవద్దు. ఇండ్ల మీదికి జేసీబీ వచ్చిన, బుల్డోజర్ వచ్చినా కంచె అడ్డం పెట్టండి. 40, 50 ఏండ్ల నుంచి ఇక్కడే ఉంటున్నం. ఇండ్లు ఎలా కూలగొడుతరని ఆ బుల్డోజర్ డ్రైవర్‌ను అడగండి.ఇందిరమ్మ రాజ్యం అన్నరు. ఇందిరమ్మ చెప్పిందా.. సోనియమ్మ చెప్పిందా ఇండ్లు కూలగొట్టమని?. ఇందిరమ్మ ఇండ్లు కడతమన్నరు. ఇప్పుడు ఇండ్లు కూలగొతమంటున్నరు. ఇక్కడున్న ఇండ్లను కూలగొట్టి హోటల్ కడుతా, పార్కులు కడతా అంటే ఎవరికోసం?. గవర్నమెంట్లకు రాకముందు నల్లబిల్లులు కడుతా, కరెంటు బిల్లులు కడుతా అన్నడు. ఎప్పుడన్నా చెప్పిండా ఇండ్లు కూలగొడుతా అని. ఇండ్లు కూలగొడుతా అంటే ఓట్లు పడుతుండెనా?. మీరు గెలిపించిన ఎమ్మెల్యే ఇక్కడున్నడు. మరీ మీరు గెలిపించిన ఎంపీ ఎక్కడపోయిండు. కిషన్ రెడ్డి ఏడపోయిండు. గరీబోళ్లను లేపేయమని కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి కూడ బలుకున్నారా?. మీకు కష్టం వచ్చినప్పుడు ఎవరు మీతో ఉంటరో ఒక్కసారి అర్థం చేసుకోండి. ఎవరి నియ్యత్ ఏందో ఆలోచించండి. దేవుని పేరుచెప్పి ఓట్లేయించుకునుడు కాదు.. పేద ప్రజలే దేవుండ్లనుకుంటే వాళ్లకు కష్టం వచ్చినప్పుడు వాళ్లకోసం నిలబడేటోడు నాయకుడు. అంతేతప్ప దేవుని పేరుచెప్పుకుని ఓట్లేయించుకుని పదవులల్ల కూర్చొని ప్రజలకు కష్టం వచ్చినప్పుడు తప్పించుకుని తిరిగోటోడు నాయకుడు ఎట్లయితడని కిషన్ రెడ్డిని అడుగుతున్న.

ఇయ్యాల ఒక్క అంబర్‌పేట నియోజకవర్గంలోనే 16 వందల కుటుంబాలను రోడ్లపై పడేస్తున్నరు. కానీ బయటికి చెప్పే లెక్కలు వేరున్నయ్. లోపల అలగున్నయ్. సుమారు 40 వేల కుటుంబాలను అంటే లక్షన్నర మందిని రోడ్లమీద పడేసే ప్రయత్నం ఈ మూసీ ప్రాజెక్టు. ఎవడడిగిండు అసలు ఈ మూసీ ప్రెజెక్టును. గరీబోళ్లకు రూ.2500 ఇస్తాన్నవ్ అది ఇవ్వు. బతుకమ్మ చీరలు రెండిస్తా అన్నవ్. ఒక్కటీకూడా లేదు. రేవంత్ రెడ్డిని నమ్ముకుంటే ఒక్కటి కూడా ఉండవ్. గరీబోళ్లకు పనిచేయమని గద్దెనెక్కిస్తే.. ఇవాళ పేదోళ్ల ఇండ్లు కూలగొడుతా.. రోడ్డుమీద పడేస్తా అంటే ఇక్కడ చూస్తూ ఊకునేటోళ్లు ఎవ్వరు లేరు. భుజం భుజం కలిపి మీతో కలిసి కొట్లాడుతం. 2400 కిలోమీటర్ల నమామీ గంగ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ ప్రభుత్వం రూ.20 వేల కోట్లు ఖర్చుపెడితే.. 55 కిలోమీటర్ల మూసీ ప్రాజెక్టుకు రేవంత్ రెడ్డి రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడ్తడట. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ.4 వేల కోట్లతోని మూసీ శుద్ధి చేసేందుకు ఎస్టీపీ ప్రాజెక్టులు ప్రారంభించాం. అదేవిధంగా మూసీపై 540 కోట్లతో 15 బ్రిడ్జిలు మంజూరు చేసినం.

బీఆర్ఎస్ హయాంలో ఇదే ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్లు అవుతాయని లెక్కగట్టాం. కానీ ఒకేసారి పది రెట్లు ఎలా పెరిగింది? దీనికి సమాధానం చెప్పేటోడు లేడు. ఇండ్లు కూలగొడతామంటే తాము ఊరుకునేది లేదు. శంకర్‌నగర్‌లో ఇండ్లు కూలగొడుతున్నరట. రేవంత్ రెడ్డికి ఏమన్నా సిగ్గుంటే.. నిన్ననే హైకోర్టు చెప్పింది. ఇండ్లు కూలగొట్టదని. రేవంత్ రెడ్డి నువ్వు మొగోనివైతే ముందు ఆరు గ్యారంటీలు అమలు చేయ్. ఆడపిల్లలకు ఇస్తానన్న నెలకు రూ.2500 ఇవ్వు. ముసలోళ్లకు రూ.4 వేలు ఇవ్వు. రైతులకు రుణమాఫీ చెయ్. రైతుబందు రూ.15 వేల ఇవ్వు. ఆటో డ్రైవర్లకు బోర్డు పెడతా అన్నవ్ ముందు అది చెయ్.




# గచ్చిబౌలి నిథిమ్ లో అక్రమ నిర్మాణం కూల్చివేత

- హైకోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్మెంట్ (నిథిమ్) లో చెరువును ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని మంగళవారం కోర్టు ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టారు. శేరిలింగంపల్లి మండల గచ్చిబౌలిలోని సర్వేనెంబర్ 71లో 3 ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో రామమ్మకుంట చెరువు విస్తరించి ఉంది. చెరువు ఎఫ్ టి ఎల్ తో కలుపుకొని దాదాపు 5 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అయితే ఈ చెరువు చుట్టూ నిథిమ్ క్యాంపస్ విస్తరించి ఉండగా గత కొన్ని సంవత్సరాల క్రితం నిథిమ్ యాజమాన్యం చెరువు బఫర్ జోన్ లో కొత్తగా భవన నిర్మాణం చేపట్టింది. కాగా చెరువును పూడ్చి భవన నిర్మాణం చేపట్టడంపై పలు స్వచ్ఛంద సంస్థలు, హెన్ఆర్సిపిసి కోర్టును ఆశ్రయించారు.దీంతో వివాదం కోర్టుకు చేరగా భవన నిర్మాణం పనులు మధ్యలోనే నిలిచిపోయింది.కాగా కొన్ని రోజుల క్రితం హైకోర్టు సదరు భవనాన్ని తొలగించాలని ఆదేశాలు ఇవ్వడంతో నిథిమ్ యాజమాన్యం భవనం కూల్చివేత పనులను చేపట్టింది.

# శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి హుండీ లెక్కింపు

- స్వామి వారి హుండీ ఆదాయం రూ.9,20,092
- దేవస్థానం చైర్మన్ బైస సుధాకర్ యాదవ్



**పటాన్ చెరు,విశాలభారతి:**పటాన్ చెరు నియోజకవర్గం అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉత్తర కాశీగా పేరుపొందిన బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపును నిర్వహించారు. శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ బైస సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో దేవదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఈఓ శశిధర్ సమక్షంలో ఆరు నెలలకు సంబంధించిన హుండీ లెక్కింపును నిర్వహించారు. స్వామి వారి హుండీ ఆదాయం రూ.9,20,092(తొమ్మిది లక్షల ఇరవై వేల తొంబై రెండు) వచ్చినట్టు వారు తెలిపారు. ఈ హుండీ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి కేటాయిస్తామని వారు తెలిపారు. శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారికి నిత్య పూజలు అందిస్తూ, ఆలయ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతూ, భక్తులకు అన్ని సౌకర్యాలు అందజేస్తున్నామని ఆలయ చైర్మన్ బైస సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు రమేష్ యాదవ్, మహేష్ కుమ్మరి, మల్లేష్, ఎల్లన్న, లక్ష్మీనారాయణ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి, భక్తులు, పాల్గొన్నారు.



# రామచంద్రాపురంలో 9న బతుకమ్మ,12న దసరా పండుగ

- పండుగలను ఘనంగా జరుపుకుందాం
- రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్

**పటాన్ చెరు,విశాలభారతి:**రామచంద్రాపురంలో ఈనెల 9న బతుకమ్మ, 12న దసరా పండుగను నిర్వహించేందుకు నిర్ణయించారు. మంగళవారం రామచంద్రపురం శ్రీనివాస్ నగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పట్టణ ప్రముఖులతో సమావేశం ఏర్పాటు చసిస్థానిక పెద్దల సమక్షంలో పండుగ తేదీలను ఖరారు చేశారు. కార్పొరేటర్ పుష్ప నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బతుకమ్మ పండుగ 9న, 12వ తేదీన దసరా రావణదహనకాండ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రకటించారు. బతుకమ్మ, దసరా పండుగలను ప్రతి ఏడాది మాదిరిగా ఈ సారి కూడా కూడా పెద్ద ఎత్తున రామచంద్రపురం పట్టణంలోని సండే మార్కెట్ మైదానంలో ఏర్పాటు చేస్తున్నట్టు కార్పొరేటర్ పుష్ప తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రొద్దుటూరు లక్ష్మణ్, ఆలయ అర్చకులు బాలకృష్ణ, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, కారికె సత్యనారాయణ, జ్ఞానేశ్వర్ గౌడ్, ఐలాపుర్ ఐలేష్, రాగం రమేష్, ఒగ్గు భిక్షపతి, నర్సింహా రెడ్డి, రాంరెడ్డి రవీందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, జనముల బాలరాజు, బైకన్ సాయిలు యాదవ్, బైకన్ నవీన్ యాదవ్, కావలి శ్రీనివాస్, మంగలి మణయ్య, చాకలి నర్సింహా, పుర్ర సురేందర్,పుట్నాల సత్యనారాయణ, గొంత్యాల వీరేశం, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు




# గీతంలో స్వచ్ఛ భారత్ అభియాన్

- విద్యార్థులు, వాలంటీర్లను ఉత్సాహపరుస్తూ స్వయంగా పాల్గొన్న గీతం ఉన్నతాధికారులు

**పటాన్ చెరు,విశాలభారతి:**మన దేశ ప్రధాని దార్శనికత, స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత (ఫోర్ ఎస్) ప్రచారానికి అనుగుణంగా, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో స్వచ్ఛ భారత్ అభియాన్ ను మంగళవారం చేపట్టింది. స్వచ్ఛ భారత్ మిషన్ పదో వార్షికోత్సవ వేడుకలలో భాగంగా సెప్టెంబర్ 17న దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 2న మహాత్మా గాంధీ జయంతితో ముగుస్తుంది. దీనిని పురస్కరించుకుని గీతం ఆతిథ్య (హాస్పిటాలిటీ) విభాగం నేత`త్వంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు స్వచ్ఛతా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు ప్రసంగంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఇది విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. స్వచ్ఛ భారత్ అభియాన్ కేవలం పరిశుభ్రత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి బాధ్యత అని, మన గౌరవాన్ని మనం పెంపొందించుకోవడమేనన్నారు. పరిశుభ్రత ప్రతిజ్ఞ తరువాత గీతం ప్రాంగణం పరిసరాల్లోని రోడ్లు, పార్కులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రపరిచారు. తమ ప్రాంగణం, చుట్టుపక్కల ప్రదేశాలను శుభ్రంగా ఉంచడమే గాక ప్రజల భాగస్వామ్యం, వారికి దీనిపై అవగాహన కల్పించడం, శుభ్రతను పెద్దయెత్తున చేపట్టడం, పారిశుధ్య కార్మికుల సంక్షేమం వంటి విస్త`త లక్ష్యాలకు ఇది దోహదపడింది అనడంలో అతిశయోక్తి లేదు. కోర్ ఇంజనీరింగ్ డీన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం డిప్యూటీ డైరెక్టర్ అంబికా ఫిలిప్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పీవీ నాగేంద్ర కుమార్ తదితరులు వాలంటీర్లు, విద్యార్థుల ఈ సామాజిక ప్రయత్నాన్ని ప్రశంసించారు. స్వచ్ఛత, శుభ్రతలో విద్యార్థుల సహకారం ప్రాముఖ్యతను వారు వివరించారు. ఈ కార్యక్రమం పరిశుభ్రత, ప్రజారోగ్యం ప్రాముఖ్యతను బలోపేతం చేయడమే గాక, సామాజిక బాధ్యత, జాతీయ ప్రచారాలలో చురుకైన సమాజ ప్రమేయం పట్ల గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.

# పిల్లాపాపలతో ప్రశాంతంగా నిద్రపోండి

- మీ ఇళ్లు ఎవరు కూల్చరు..
- మీ ఇంటిపై ఒక్క గడ్డపార పడదు
- మీ ఇంటి మీదికి ఒక ప్రోక్లైన రాదు
- మూసి సమీప నివాసులతో మధుయాష్కీగౌడ్
- కొత్తపేట, చైతన్యపురి డివిజన్ లలో ప్రజలతో కలిసి మాట్లాడిన మధు యాష్కీ గౌడ్



**ఎల్బీనగర్, విశాలభారతి:**'మా కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఇంటిని అక్రమంగా కూల్చదు.. పిల్లాపాపలతో నిశ్చింతంగా నిద్రపోండి.. నాది గ్యారెంటీ ' అని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ మూసి సమీప కాలనీల ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అంటేనే పేదలకు ఇళ్లు ఇచ్చే ప్రభుత్వమని.. ఎవరి ఇళ్లు కూలగొట్టదు అని పేర్కొన్నారు. మీ ఇళ్ల పైకి ఒక్క గడ్డపార రాదని.. ఒక ప్రోక్లనర్ కూడా రాకుండా చూసే బాధ్యత నాది అని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ లో భాగంగా సమీప కాలనీలలోని ఇళ్లు కూలగొడతారని, మార్కింగులు ఇచ్చారని ప్రజలు గందరగోళానికి గురవుతున్న నేపథ్యంలో మధుయాష్కిగౌడ్ మంగళవారం కొత్తపేట, చైతన్యపురి డివిజన్లో పర్యటించారు. మూసి సమీప ఇళ్ళ నివాసులతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఎవరు ఇళ్లు కూలగొట్టరని తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఎల్బీనగర్ నియోజకవర్గం లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, నాయకులు మూసి పరివాహక ప్రాంతంతో పాటు చెరువులు, కుంటలను కబ్జా చేసి అక్రమంగా సంపాదించారన్నారు. వారే ఈరోజు ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని , ప్రజల వద్దకు వచ్చి నీతి మాటలు మాట్లాడుతున్నారని మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు.అక్రమార్కులను వదిలిపెట్టేది లేదని, అక్రమాలకు పాల్పడ్డ అధికారులు, కబ్జా రాయుళ్లు, బిల్డర్ల పై తప్పకుండా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ , కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి , జిహెచ్ఎంసి మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వజీద్ ప్రకాష్ గౌడ్ ,సీనియర్ నేత ఎస్వీ కృష్ణప్రసాద్ , శశిధర్ రెడ్డి, రజిని రావు తదితరులు ఉన్నారు.



# క్రైస్తవుల పై దాడి హేయమైన చర్య

- క్రైస్తవుల పై దాడి చేసిన వారిని శిక్షించాలి
- నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ జాతీయ నాయకులు జాన్సన్ డిమాండ్

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఆదివారం క్రిస్టియన్స్ ప్రార్థన చేస్తున్న సందర్భంగా క్రైస్తవుల పై దాడి హేయమైన చర్యగా భావిస్తున్నామని నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ కమిటీ సభ్యులు జాన్సన్ అన్నారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ.. క్రైస్తవుల పైన దాడి చేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసామని తెలిపారు. గతంలో ఇబ్రహీంపట్నం ఎంబీఆర్ నగర్ కాలనీలో చర్చిలకు ప్రవేశించి పాస్టర్ పైన దాడి చేశారని, ఇప్పుడు కూడా క్రిస్టియన్ వ్యక్తులపైన దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఇబ్రహీంపట్నంలో రోజురోజుకు క్రిస్టియన్ల పైన దాడులు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు.. హిందూ ముస్లిం క్రిస్టియన్ లో అన్నదమ్ములుగా ప్రశాంతంగా కలసి ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కొంతమంది మత కల్లోలను సృష్టిస్తున్నారని అన్నారు.కొంతమంది ఇబ్రహీంపట్నం ప్రాంతంలో క్రైస్తవుల పైన వరుస దాడులు జరపడం వలన యావత్ నేషనల్ క్రిస్టియన్ బోర్డు ఖండిస్తుందని అన్నారు. ఇప్పటికైనా పోలీస్ యంత్రాంగం ప్రభుత్వం చోరువ చూపి క్రైస్తవుల పైన దాడు లను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు చెరుకూరి రాజు, టిల్లు, పాస్టర్లు తదితరులు ఉన్నారు..



# ఉన్నత లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు(జిన్నారం), విశాలభారతి:**విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివితే బంగారు భవిష్యత్తుకు అడుగు పడుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం జిన్నారం ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థి జీవితంలో కళాశాల విద్య అత్యంత కీలకమని అన్నారు. భవిష్యత్తుకి పునాదివేసే కళాశాల విద్యను శ్రద్ధతో అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విజ్ఞప్తి చేశారు. కళాశాల అభివృద్ధి గతంలో సి.ఎస్.ఆర్ నిధులు కేటాయించామని గుర్తు చేశారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా కళాశాలను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆ సమస్య మా పరిధిలోకి రాదు

- కంటోన్మెంట్ అధికారులే పరిష్కారం చూపాలి.
- కొంతం దీపిక



**విశాలభారతి, కంటోన్మెంట్ :**రోడ్ల పై వరద నీరు నిలిచింది. ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం వాటిల్లింది. సమస్యను స్థానికులు పట్టించుకోవడం లేదు. నీరు నిలిచిన స్థలానికి సమీపంలోనే కోర్టు ప్రాగణం ఉంది. నిత్యం ప్రయాణికలుతో రద్దీగా ఉంటే రోడ్డు అయినా సమస్యను పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకువెల్లిన వారు లేరు. కానీ స్థానిక కార్పోరేటర్ ఆ సమస్యను పరిష్కారం చేయాలని స్వయంగా తానే రంగంలోకి దిగింది. దీనితో నిమిషాల్లో రోడ్డు పై నిలిచిన నీటిని తొలగించిన అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చేశారు. వివారాల్లోకి వెల్లితే సికింద్రాబాద్ కోర్ట్ రోడ్డు చివరన స్విస్ క్యాస్టిల్ బేకరీకి ఎదురుగా నీళ్లు ఆగి చెరువుల తయారైంది.దీనితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు.ఈ సమస్యను పరిష్కారం చూపాలని స్థానిక జిహెచ్ఎంసి అధికారులు దృష్టికి తీసుకు వెల్లిన కార్పోరేటర్ కొంతం దీపికకు చేదు అనుభవం ఎదురైంది. తమ పరిదిలోకి రాదని హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి సంబంధించి అని చెప్పారు, దీనితో వారిని సంప్రదించి సమస్యను వివరించారు. వాటర్ వర్క్ అధికారులు సైతం తమ పరిధిలో లేదని, కంటోన్మెంట్ బోర్డ్ అధికారులు ఆ సమస్యను పరిష్కారం చేస్తారని తెలిపారు.దీనితో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ హెల్త్ అండ్ శానిటేషన్ సూపర్డెంట్ దేవేందర్ రెడ్డి వివరించారు. దీనితో జిహెచ్ఎంసి ఏ ఈ చంద్రశేఖర్, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి మేనేజర్ హకీమ్ కోఆర్డినేషన్ తో అందరూ అక్కడ సమస్యను పరిష్కారం చేశారు.స్ట్రామ్ వాటర్ డ్రాన్ లో మట్టి నిండడంతో రైన్ వాటర్ రివర్స్ వస్తుందని వివరించారు. అక్కడున్న మంచినీటి వాల్వ్ లీక్ అవడంతో ఆ నీరు కూడా అక్కడే నిలిచిపోవడం స్థానికులు తెలిపారు. వెంటనే ఎమర్జెన్సీ టీం లతో స్ట్రామ్ వాటర్ డ్రైన్లను గుర్తించి మట్టిపూడికలను తీసివేసినట్లు తెలిపారు.కంటోన్మెంట్ బోర్డ్ అధికారులు కూడా స్కూల్ పక్కన కట్టిన డ్రెయిన్ వాల్ నుండి నాలవైపు కొత్త పైప్ లైన్ వేయాలని సూచించగా త్వరలోనే పైప్ లైన ఫనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

- వడ్డేపల్లి రాజేశ్వరరావు సతీమణి వడ్డేపల్లి యామిని



**కూకట్ పల్లి,విశాలభారతి:**బతుకమ్మ తెలంగాణ ఆడపడుచులకుఇష్టమైన పండగ అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సతీమణి వడ్డేపల్లి యామిని అన్నారు. మంగళవారం కూకట్ పల్లిలో లో బతుకమ్మ వేడుకలు రెండవ రోజు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ పండగ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిక అన్నారు. బతుకమ్మ అంటే పూల పండుగ అని, కలిపి తెలంగాణలో దశాబ్దాలుగా ఈ పండుగ జరుపుకుంటున్నారన్నారు. బతుకమ్మ సంబరాలు తెలంగాణ పండగల్లో పెద్దపీట వేస్తాయని తెలిపారు.



# బండి రమేష్‌ను కలిసిన కనకదుర్గ ఉత్సవ కమిటీ సభ్యులు

**కూకట్ పల్లి, విశాలభారతి:**దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూకట్పల్లి పరిధిలోని ఫిరోజ్‌గూడ లో శ్రీశ్రీశ్రీ కనకదుర్గా ఉత్సవాల వేడుకలకు హాజరవ్వాలని బండి రమేష్ ను కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బండి రమేష్ ను శాలువాతో సన్మానించారు. అనంతరం మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్ కి,Aబ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి కి,మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఫిషర్మన్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల నరేందర్,జనరల్ సెక్రటరీ హేమంత్,ఎడ్ల మనోజ్,టెక్మల కృష్ణ, కూకట్ పల్లి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గజానంద్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# చట్టాలు గౌరవించకుంటే బాంగ్లాదేశ్‌కు పట్టినగతే

- టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి,విశాలభారతి:**హైడ్రా విషయంలో ప్రజలు తిరగబడితే బంగ్లాదేశ్ ప్రధానికి పట్టిన గతే ప్రభుత్వానికి పడుతుందని కూకట్పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు అన్నారు. హైడ్రా న్యాయస్థానాల నిర్ణయాలను చట్టాలను సైతం గౌరవించని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని అన్నారు . కూకట్పల్లి నియోజకవర్గం లో హైడ్రా పేద ప్రజల జోలికి వస్తే సహించేది లేదని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ పరిధిలోని బోయిన్ చెరువు ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరిజన బస్తికి చెందిన పేద ప్రజలు తమ నివాసాలను కూల్చివేస్తారన్న భయాందోళన వ్యక్తం చేయగా ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని చెరువుల పూర్తి సమగ్ర సమాచారాన్ని తనకు అధికారులు అందజేయాలని ఆదేశించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే రాజకీయ నాయకుల పై ఘాటైన విమర్శలు చేశారు. పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ భయపడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలలో హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్ద నరసింహ యాదవ్, నరేందర్ గౌడ్, ఇర్ఫాన్ , మక్కాల నర్సింగ్, ఇజాజ్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



# నీట్ లో మెరిసిన గిరిజన విద్యార్థినీ శృతిక

**సైదాపూర్ విశాల భారతి** కరీం నగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రాయికల్ తండా గ్రామానికి చెందిన బానోతు శృతిక నీట్ లో 492 మార్కులు సాధించి ఎంబిబిఎస్ కరీంనగర్ గవర్నమెంట్ కాలేజీలో సీటు సంపాదించింది. రాయికల్ తండాకు చెందిన విద్యార్థి ఎం బి బి ఎస్ లో సీటు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. మండకేంద్రం లోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పూర్వ విద్యార్థినీ శృతికను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ అనగోని తిరుపతి గౌడ్,మాజీ సర్పంచ్ బానోత్ బిక్షపతి, శంకర్ నాయక్, రవి నాయక్, రంగా నాయక్, ప్రశాంత్ తదితరులు వున్నారు.



# దుర్గామాత మండపానికి విరాళం

**ఆర్మూర్, విశాల భారతి** నందిపేట్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శక్తి రూపిని దుర్గామాత మండపానికి గాండ్ల సంతోష్,నాగరాజ్ రూ. 11 వేల రూపాయల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. నవరాత్రి ఉత్సవాల్లో ఆధ్యాత్మిక భావనను ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు దుర్గామాత ఆశీస్సులు ఉండాలని కమిటీ సభ్యులు కోరారు.





# విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

- మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్
- ఘనంగా స్టాన్లీ కళాశాల స్నాతకోత్సవం

**సికింద్రాబాద్, విశాలభారతి:** స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో హైటెక్ సిటీ నందు గల శిల్పకళా వేదికలో కళాశాల స్నాతకోత్సవం మరియు వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రో.పప్పుల లక్ష్మి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఓయు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఓయు ప్రో.రాములు గౌరవ అతిథిగా హాజరయ్యారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గౌరవ అతిథిగా హాజరయ్యారు. శ్రీనివాస రావు మహంకాళి (సీఈవో టి హబ్) మరియు గౌరవ బిషప్ ఎంఎ డేనియల్ (మెథడిస్ట్ చర్చ్ ఆఫ్ ఇండియా) వక్తలుగా హాజరయ్యారు. స్టాన్లీ కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కే. కృష్ణారావు, మేనేజ్మెంట్ సభ్యులు శ్రీ ఆర్ ప్రదీప్ రెడ్డి , కళాశాల డీన్, అకాడమిక్స్ ప్రొఫెసర్ ఏ. వినయ్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక, డైరెక్టర్ డా. వి అనురాధ , ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి , అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఏ రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వి అనురాధ అధ్యక్షత వహించారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌరవ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. నేడు విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని చెప్పారు. జ్ఞానంతో పాటు సాంకేతిక నైపుణ్యాలు ముఖ్యమని తెలియజేశారు. నేడు అనేక కంపెనీలు, పరిశ్రమలు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వము యువతకు ఉద్యోగ కల్పన కోసం అనేక రకాలైన కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. హైదరాబాదు మహానగరం లక్షలాది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆసరాగా ఉందని తెలియజేశారు. సమాజం యొక్క అభివృద్ధిలో మహిళ ఇంజనీర్లు ఎంతో అవసరమని చెప్పారు. పేద విద్యార్థుల సైతం ఇంజనీరింగ్ విద్యను చదువుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓయూ రిజిస్ట్రార్ ప్రో. పి. లక్ష్మి నారాయణ మాట్లాడుతూ. ఇంజనీరింగ్ విద్య నాలుగో సంవత్సరం పూర్తి చేసుకుని ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు శాస్త్రీయ పద్ధతిని అనుసరించి విషయాలను చూడాలని చెప్పారు. ఒక దేశం యొక్క అభివృద్ధి ఆ దేశంలో ఉన్న విద్యార్థులు, యువతీ యువకుల పైన ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని కోరారు. విద్యార్థినులు కేవలం ఇంజనీరింగ్ తోనే ఆగిపోకుండా ఆపైన ఉన్నత చదువులను కూడా చదవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. విదేశాలకు కూడా వెళ్లి ఉన్నత చదువులను చదవాలని సలహా ఇచ్చారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. డా.వి.అనురాధ కృతజ్ఞతతో కార్యక్రమంలో ముగించారు.



# ప్రతి ఒక్కరూ వయో వృద్ధులను గౌరవించాలి

- వయోవృద్ధులకు జిల్లా కేంద్రంలో సంక్షేమ భవన నిర్మాణం
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, విశాల భారతి** ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను గౌరవంగా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరం నందు జిల్లా సంక్షేమ శాఖ ద్వారా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ బిఎస్ లతతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ ,సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, వయోవృద్ధులు ఆరోగ్యం, ఆస్థిని ఎప్పుడూ కాపాడుకోవాలని కలెక్టర్ తెలిపారు. సూర్యాపేట పట్టణంలో వయోవృద్ధుల సంక్షేమం కోసం భవన నిర్మాణాన్ని డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. వయోవృద్ధుల కొరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని, వయోవృద్ధులు ఆస్పత్రికి వెళ్ళినప్పుడు వారిని సంప్రదించాలని కలెక్టర్ కోరారు. ఈసారి జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో చాలా మంది తమను కొడుకులు పోషించడం లేదని తల్లిదండ్రులు రావడం చాలా బాధ వేసిందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి శుక్రవారం వయోవృద్ధులు ఆర్డీవో కార్యాలయంలో తమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. వయోవృద్ధుల సమస్యలను, మెయింటినెన్స్ ఆర్డీవోలు చూస్తారని,వారి ఆస్థి,భూముల మార్పిడి, జిల్లా అప్పిలేట్ ట్రిబునల్స్ కలెక్టర్ తో సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి రెవెన్యూ డివిజన్ కి ఒక కమిటీ ఏర్పాటు చేసి వయోవృద్ధుల సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని కలెక్టర్ తేజస్ అన్నారు. వయోవృద్ధులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వయోవృద్ధులందరికీ కలెక్టర్ స్వయంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యు ఓ నర్సింగరావు, ఆర్డిఓ వేణుమాధవ్, డిఎస్పి రవికుమార్, వయోవృద్ధుల సంఘం అధ్యక్షులు రాంబాబు, సెక్రెటరీ అమీర్ ఖాన్, ఓల్డ్ ఏజ్ హోమ్ ఇన్చార్జ్ సత్యనారాయణ, విజయమ్మ ,సావిత్రమ్మ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# సంస్కృత అకాడమీని సందర్శించిన మూల్యాంకన సమితి

**సికింద్రాబాద్, విశాలభారతి:** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మకమైన సంస్కృత అకాడమీని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన మూల్యాంకనసమితి (పీర్ కమిటి) మంగళవారం సందర్శించారు. సంస్కృత భాషా పరివ్యాప్తికి నిరంతరం శ్రమిస్తున్న సంస్కృత అకాడమీ కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఆర్థికసహాయంతో నడుస్తున్నది. ఆచార్యకే నీలకంఠం నిదేశకత్వంలో సంస్కృత భాషాభివృద్ధికై, సంస్కృత గ్రంథముద్రణకై చేస్తున్న కృషి అనుపమానమైందని, గత నాలుగు సంవత్సరాల కాలంలో 75 పైగా పుస్తకాలను ముద్రించిన కృషి అత్యంత ప్రశంసనీయమైందని పీర్ కమిటి సభ్యులు సంతోషాన్ని వ్యక్తంచేశారు. తిరుపతి రాష్ట్రీయ సంస్కృవిశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొఫేసర్ సత్యనారాయణ ఆచార్య నాయకత్వంలో వచ్చిన ముగ్గురు కమిటీ సభ్యులలో ఢిల్లీలోని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రొఫేసర్ దేవానంద శుక్లా, జామైమిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంకు చెందిన సంస్కృత ప్రొఫేసర్ జయప్రకాశ్ నారాయణ్ ఉన్నారు. ఆయా శాస్త్రాలలో నిష్ణాతులైన ఈ ముగ్గురు ఆచార్యుల బృందం సంస్కృత అకాడమీ సభ్యులనే కాకుండా ఇక్కడికి వస్తున్న అనేక సంస్కృతాభిమానులను కూడ కలిసి సంస్కృత అభివృద్ధికి అకాడమీ చేస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. అకాడమీ మేనేజ్ మెంట్ కమిటి సభ్యులు ఆచార్య శశిరేఖ, ఆచార్య విద్యానంద ఆర్య ఇత్యాదులతో కూడ మాట్లాడి, ఆ తర్వాత పరిశోధక విద్యార్థులను కూడ కలిసి అనేక విషయాలు చర్చించారు. చివరగా సాయంత్రం ముగింపు సమావేశంలో పరిశోధనా రంగంలో, వివిధ శాస్త్రాలపై సెమినార్ల నిర్వహించుటలో, అనేకవిధకార్యక్రమాల రూపకల్పనలో అకాడమీ చేస్తున్న కృషి అతుల్యమని అకాడమీకి ఉన్నతమైన స్థానం కల్పించడానికి కృషి చేస్తామని, అకాడమే స్వయంగా సంపూర్ణమైన అర్హత కలిగి ఉన్నదని కమిటీ అధ్యక్షులు ప్రొఫేసర్ సత్యనారాయణ ఆచార్య తెలిపారు.ఈ విధంగా మూల్యాంకనం కొఱకు పీర్ కమిటీని పంపించిన కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య శ్రీనివాస వర్ఖేడికి, విశ్వవిద్యాలయ మూల్యాంకన సమితి అధ్యక్షులు ఆచార్య ఈశ్వర్ భట్ కి ఆచార్య నీలకంఠం కృతజ్ఞతలు తెలిపారు. సంస్కృత అకాడమీ డిప్యూటి డైరెక్టర్ కే వరలక్ష్మి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సంస్కృత అకాడమీని సందర్శించారు.



# ఉపాధికి ఎంబీఏ విభాగం పెట్టింది పేరు

- ఘనంగా మోడల్ ఇండిక్షన్ ప్రోగ్రాం

**సికింద్రాబాద్ ,విశాలభారతి:** ఉస్మాని విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ ( ఎంబీఏ ) మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం కళాశాల సెమినార్ హాల్లో ఎంబీఏ టెక్నాలజీ , ఎంబీఏ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్, నూతన విద్యార్థులకు ఎఐసిటీఈ మోడల్ ఇండక్షన్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ మరియు పూర్వ విద్యార్థి బి. భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ. విద్యార్థులకు ఉన్న విద్యా ఉద్యోగ అవకాశాలు ఎలా అందిపుచ్చుకోవాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు మరియు విభాగం హెడ్ ప్రొఫెసర్ వై. జహంగీర్ లు మాట్లాడుతూ. ఎంబీఏ విద్యను తమ విభాగంలో పూర్తి చేసుకున్న విద్యార్థులకు 99 శాతం వివిధ కంపెనీలు , సంస్థలు , కార్యాలయల్లో ,దేశ విదేశాల్లో , జాబులు పొందారని , అలాంటి విద్యార్థులకు లక్షల్లో ఆకర్షణీయమైన వేతనాలు పొందుతున్నారని ,దానికి మేము అందిస్తున్న విద్యా ,సౌకర్యాలు కారణం అన్నారు. విద్యార్థులు విభాగం లో ఉన్న సౌకర్యాలు అందిపుచ్చుకుని జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి వెంకటయ్య , ప్రొఫెసర్ స్మిత సాంబ్రాణి , ప్రొఫెసర్ సుధా , డాక్టర్ విద్యాసాగర రావు, భానుమూర్తి,డాక్టర్ వి. సమూన్నత తో పాటుగా ఎంబీఏ మొదటి సంవత్సర విద్యార్థులు,ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఉచిత కుట్టు మిషన్ శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి

**సూర్యాపేట, విశాల భారతి** కుట్టు మిషన్ శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని,లయన్స్ క్లబ్ రీజినల్ చైర్ పర్సన్ గండూరి కృపాకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి చార్టర్ ప్రెసిడెంట్ ఇరిగి కోటేశ్వరి,పాస్ట్ ప్రెసిడెంట్ బీరవోలు హైమావతి అన్నారు. కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్ఫూర్తి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యానగర్ గండూరి జానకమ్మ వాటర్ ప్లాంట్ నందు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట స్ఫూర్తి ఆధ్వర్యంలో మొత్తం మూడు విడుతలుగా నిర్వహించిన ఈ శిక్షణలో 120మంది మహిళలు శిక్షణ పొందారన్నారు. ఈ శిక్షణకు మహిళలు ఒక్కొక్కరూ రూ. 300 చెల్లించాల్సి ఉండేదని కానీ ఆ భారం వారిపై పడకుండా శిక్షకురాలుకి పదివేల వేతనం తన సొంత ఖర్చులతో ఇచ్చినట్లు తెలిపారు. ఈ కుట్టు శిక్షణలో మహిళలు రాణించేందుకు దోహదపడుతుందని మహిళలు ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తితో, స్వయం సమృద్ధి' సాధిస్తారన్నారు. ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట స్ఫూర్తి సెక్రటరీ సుమలత, ట్రెజరర్ డాకా విజయలక్ష్మి, మందడి రమాదేవి, కేతిరెడ్డి పద్మ, కొప్పు సందీప్, ముదులగర్ కళ్యాణ్, ఎండి. ఇస్మాయిల్, అనిల్, కుట్టు మిషన్ శిక్షకురాలు రేణుక తదితరులు ఉన్నారు



# దేవీ శరన్నవరాత్రి ఉత్సవ పుస్తక ఆవిష్కరణ

**కల్వకుర్తి విశాల భారతి** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవి దేవాలయంలో ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించబోయే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి పుస్తకాన్ని మంగళవారం ఆలయ ఫౌండర్ ట్రస్ట్ జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆలయంలో ఆవిష్కరించారు. పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు సహకరించే దాతలు, ఇతర కార్యక్రమాల వివరములు పుస్తకంలో పొందుపరిచినట్లు రమేష్ బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంప శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు నారాయణ రాజు, దాచేపల్లి నితిన్ కుమార్, కోశాధికారులు పానుగంటి నవీన్, సంబు తరుణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వాస మనీష్, ఉత్సవ కమిటీ ముఖ్య సలహాదారులు దాచేపల్లి శ్రీనివాసులు, గంధం ప్రసాద్, సంబు ముత్యాలు, వాస శేఖర్, జూలూరి వీరేష్, దుగ్గి వెంకటేష్, కంది ప్రవీణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్ళ పల్లి శ్రీధర్, కొండూరు కృష్ణయ్య, గుగ్గిళ్ల శంకర్, పోల సురేందర్ తదితరులు పాల్గొన్నారు .



# ఆకునూరు పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**సైదాపూర్ విశాల భారతి** సైదాపూర్ మండలంలోని ఆకునూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు పూలతో బతుకమ్మలను తయారు చేశారు. పాఠశాల విద్యార్థినిలు బతుకమ్మ ఉత్సవాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలతో పాఠశాల ప్రాంగణం మారుమ్రోగింది . ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ పండుగ అని అన్నారు. తెలంగాణ ఆడపడుచులు అందరూ సంబరంగా తొమ్మిది రోజులపాటు జరుపుకునే పండుగని అన్నారు. ఇదో ప్రకృతిని పూజించే పూల పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఠాగూర్ శాంత కుమార్ సింగ్,హన్మాండ్ల భాస్కర్,బైరీ సుధాకర్, గూడూరి రవీందర్ రెడ్డి,గోదారి సమ్మయ్య,హరియా నరేంద్ర ప్రసాద్, సుజాత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.




# యువత నచ్చిన రంగంలో కష్టపడి జీవితంలో ఎదగాలి

**సూర్యాపేట, విశాల భారతి** యువత నచ్చిన రంగంలో కష్టపడి జీవితంలో ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అన్నారు. సోమవారం సూర్యాపేట లోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీ ఆడిటోరియం నందు జిల్లా యువజన, క్రీడా నిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు 2025 లో ముఖ్య అతిధిగా జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత పాల్గొని స్వామి వివేకానంద ఫొటో కి పూలమాల వేసి,జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యువతకి ఆదర్శంగా ఉండే స్వామి వివేకానందని, భగత్ సింగ్ లను స్మరించుకుంటూ వారి ఆలోచనలను యువత అనుసరించాలని అన్నారు. దేశంలో నిరక్షరాస్యత, మూడ నమ్మకాలు ఎక్కువగా ఉన్నాయని యువత వాటిపై ప్రజలోకి వెళ్ళి సందేహాలు తొలిగించాలని, 35 సంవత్సరాలు వచ్చే సరికి కుటుంబ భాధ్యతలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి 1520 సంవత్సరాల వయస్సు నుండే యువత సక్రమంగా అలోచించి జీవితంలో ఎదగాలని, సోషల్ మీడియా లాంటి వాటిని దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇష్టంగా చేస్తే ఎంత కఠినమైన పని కూడా కష్టం అనిపించదు అని, గొప్ప వారి చరిత్రలు తెలుసుకొని వారు ఎలా ఎదిగారో యువత కూడా వారి మార్గంలో నడుచుకుంటూ ఉన్నత శిఖరాలను ఆదిరోహించాలని అన్నారు.యువత ఆది గురువు శంకరచార్య చెప్పిన మానవ సేవయే మాధవ సేవ సూక్తిని అనుసరించాలని, అలాగే యువత చదువుతో పాటు సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, కవిత్వం మొదలగు అన్ని రంగాలలో రాణిస్తేనే పరిపూర్ణం గా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా అధికారి జి.రాంచందర్ రావు, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ వెంకటెష్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలోని సన్ షైన్ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సన్ శైన్ కరస్పాండెంట్ ఇంజాపురం మహేందర్, మేనేజింగ్ డైరెక్టర్ సుమలత, హెడ్ మినిస్టర్ శిరీష, ఉపాధ్యాయ బృందం దివ్య, రేఖ, వైష్ణవి,అనూష, కమల, జయసుధ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.5000 ఆర్థిక సహాయం

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండలం కోటాలపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి లక్ష్మి, నర్సయ్య దంపతుల ఇల్లు పూర్తిగా కాలిపోయిన సందర్భంగా హొన్నజీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు వెంకంగారి జనార్ధన్ రెడ్డి, పాలకవర్గం చేతుల మీదుగా బాధితురాలుకు మంగళవారం 5000 రూపాయలు నగదు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో డైరెక్టర్లు మైలారం సుభాష్ రెడ్డి, బెల్దారి ధర్మేష్, నీరడి గంగానరేందర్, విజయ లక్ష్మి, సి.ఈ.ఓ బి.గంగానర్సయ్య సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.



# రూ.2.50 లక్షల ఎల్ఓసి అందజేత

**ఆర్మూర్, విశాల భారతి** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లిలో గల ఏడవ వార్డుకు చెందిన గంగామణి అనారోగ్యానికి గురైంది. కాంగ్రెస్ నాయకుల సమాచారంతో విషయం తెలుసుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి వారికి మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 2,50,000 ఎల్ ఓ సి ని మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, నాయకులు ఎన్ వి రవీందర్ రెడ్డి, మామిడి చంద్రశేఖర్ రెడ్డి, రాజు, నాగుల శ్రీధర్, ఏలియా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు



**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండలంలోని అన్ని గ్రామాల మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఈనెల 3,4, 5, 7 వ తేదీలలో మొత్తం 26 మంది గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులు రైతు వేదిక నందు నిర్వహిస్తామని తెలిపారు.



## ఐబి మందు అడిగినందుకు చితకబాదిన వైన్స్ సిబ్బంది

- **అడ్డు పడిన విలేకరులను దుర్భాషలాడిన వైన్స్ సిబ్బంది**
- **ఎక్సైజ్ శాఖ అధికారుల మౌనం వెనుక అంతర్యం ఏమి?**


**దంతాలపల్లి ,విశాలభారతి:** మండలంలోని మంజునాథ వైన్స్ సిబ్బంది అరాచకాలకు అడ్డు లేకుండా పోయింది. దంతాలపల్లి మండలంలో మంగళవారం సుమారు మూడు గంటల సమయంలో కొండ్రా లింగమూర్తి అనే వ్యక్తి ఐబి మందు అడగగా లేదనడంతో బెల్ట్ షాపులకు మామూలే తరలిస్తూ మేము అడుగుతే ఐబి లేదంటారు ఎందుకు అని ప్రశ్నించిన కొండ్ర లింగమూర్తిని బెల్ట్ షాపు సిబ్బంది,అనిల్ మరో ఇద్దరు వ్యక్తులు షాపు ముందు చితకబాదారు.బెల్ట్ షాపులకు తరలిస్తున్నారు మా ముందే బెల్ట్ షాపులకు ఇస్తూ మాకెందుకు ఇవ్వరు అంటూ ప్రశ్నించడంతో అనిల్ మరో ఇద్దరు వ్యక్తులు ఆ యువకుని మర్మంగాల పై తంతు చితకబాదినారు అని బాధితుడు తెలిపాడు. చంపే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో వారించిన విలేకరులను దూషించి దుర్భాషలాడీన షాపు సిబ్బంది పై మరియు మంజునాథ వైన్ షాప్ పై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. పోలీస్ స్టేషన్లో బాధితుల ఫిర్యాదు చేశారు. అనిల్ అనే మంజునాథ వైన్స్ సిబ్బంది గుండా ఇజం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్య తీసుకుంటారో వేచి చూడాలి.

## నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలి

- **ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**



**కొత్తగూడెం, విశాలభారతి:** జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న గంజాయి కేసుల గురించి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పోలీసు అధికారులతో మంగళ వారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పెండింగ్లో ఉన్న గంజాయి అక్రమ రవాణా కేసుల ప్రస్తుత స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిషేధిత గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న అధికారులకు సూచించారు. కోర్టు వారికి సరైన పత్రాలను సాక్ష్యాదారాలను సమర్పించి నిందితులకు కచ్చితంగా శిక్షపడేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మత్తు పదార్థాలను నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన టి జి ఏన్ ఏ బి వారి సలహాలు సూచనలతో ఎప్పటికప్పుడు జిల్లాలో నమోదైన గంజాయి కేసులలో పురోగతిని సాధించాలని తెలియజేసారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేసుకొని గంజాయి అక్రమ రవాణాను మరియు గంజాయి సేవించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి,ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

**ఆమనగల్లు, విశాల భారతి :** ఆమనగల్లు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఉత్సవాలలో భాగంగా ఈ సంవత్సరం నిర్వహించే ఉత్సవాల్లో పాల్గొనాలని వారికి విజ్ఞప్తి చేశారు. వీరబొమ్మ రామ్మోహన్, నరసింహ పాల్గొన్నారు.



## ఎంఈఓను కలిసిన ఆదివాసీ సంఘం నాయకులు

**పినపాక, విశాలభారతి:** ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టిసారించాలని, సమస్యలను పరిష్కరించాలని జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘంభద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల ఆర్కే దొర, ఆదివాసి ఐక్యవేదిక పినపాక మండల అధ్యక్షులు తోలెం శ్రీను ఎంఈఓ కొమరం నాగయ్యను కోరారు. మంగళవారం పినపాక మండల నూతన విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య ను మర్యాద పూర్వ కంగా కలిసి మండలంలో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. అనంతరం ఎంఈఓ ను ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సోలం అశోక్, ఆదివాసీ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కలివేటి పవన్, ఉపాధ్యాయులు కేశవరావు, రవికుమార్, దుబ్బ ముకేశ్, సాంబ, కొమరం అరుణ్ బాబు, మూర్తి దొర అడ్వకేట్, సనప భరత్, మడి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్తలకు అవగాహన సదస్సు



**వాజేడు, విశాలభారతి:** వాజేడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆశ కార్యకర్తలకు వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య అధికారి డాక్టర్ మధుకర్ మాట్లాడుతూ ఇంటింటా సర్వే లో భాగంగా వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలలో ప్రజలు బలహీనతగా ఉన్న గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు రక్తహీనంగా ఉన్నటువంటి వారిని గుర్తించి. ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు చేయించి మందులు వాడేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశ వర్కర్లకు ఈ సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి మధుకర్, డాక్టర్ గ్యానస, హెల్త్ సూపర్వైజర్ వెంకటరమణ , కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తుంది

- **ప్రోటోకాల్ ఉల్లంగణపై విరుచుకుపడ్డ బీఆర్ఎస్ నాయకులు**



**బాల్కొండ, విశాల భారతి** ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తుందని బీఆర్ఎస్ నాయకులు జీల్లా డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, మోర్తాడ్ మండల పార్టీ అధ్యక్షుడు ఏలీయా, పూర్ణానందం, రేగుంట దేవేందర్, ముస్కు భూమేశ్వర్, నాగధర్ రెడ్డి అన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు బాల్కొండ నియోజకవర్గ పర్యటన సందర్భంగా జరిగిన ప్రోటోకాల్ ఉల్లంగణపై విరుచుకుపడుతు మంగళవారం మోర్తాడ్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాలరాసే విధంగా ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తుంది అని అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేని చోట కావాలనే ప్రభుత్వం విపక్ష ఎమ్మెల్యే హక్కులకు భంగం కలిగిస్తోందన్నారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభ కార్యక్రమాల్లో కూడా ఎమ్మెల్యే లేకుండానే కార్యక్రమాలను పూర్తి చేస్తున్నారని అన్నారు. సెప్టెంబర్ 30వ తేదిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి సంవత్సరికం కార్యక్రమం ఉన్నదని,ఇంకో రోజు కార్యక్రమాలు పెట్టుకోవాలని ఎమ్మెల్యే వేముల కోరినాగాని, అదే రోజు ఉద్దేశ్యపూర్వకంగా బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు అంటే ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడ్డారు అనడానికి ఇది నిదర్శనమని తెలిపారు. ప్రోటోకాల్ ఉల్లంగణ జరగటానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు కారణమని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలోనే ఉండగా మంగళవారం వేల్పూర్లో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రోటోకాల్ ప్రకారం కనీసం ఎమ్మెల్యేకు కూడా సమాచారం ఇవ్వలేదని అన్నారు. గత మూడు రోజుల క్రితమే ప్రభుత్వం సోయా కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయాలని, ప్రవేట్ వ్యాపారులకు పంట అమ్ముకొని రైతులు నష్టపోతున్నారని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే వేముల డిమాండ్ చేసిన సంగతి ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాక్షేత్రంలో తగిన మూల్యం తప్పదని అన్నారు. అధికారం ఎప్పుడు ఒకలా ఉండదని మారుతూ ఉంటుందని రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ నాయకులకు, ప్రభుత్వానికి ఇంతకు ఎక్కువ అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజి జెడ్పిటిసి బద్దం రవి, సొసైటీ చైర్మన్ బద్దం అశోక్ రెడ్డి, ఆనంద్,మోహన్ రెడ్డి,గోపిడి సత్యనారాయణ, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



## పెర్క కొండారం పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**శాలిగౌరారం, విశాలభారతి:** మండలంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. పెర్క కొండారం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల ల్లో విద్యార్థులు రంగు రంగు పూలను తీసుకువచ్చి బతుకమ్మలను పేర్చి నృత్యాలు చేస్తూ పాటలు పాడుతూ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందుల సైదులు, నల్లగొండ రమేష్, వెంకటేశ్వర్లు, అంజయ్యలు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వాళ్ళతో కలిసి బతుకమ్మ ఆడారు. ప్రాథమిక పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు చామల నర్సయ్య మాట్లాడుతూ బతుకమ్మ ఈ తెలంగాణ సంస్కృతికి చిహ్నం అని ప్రతి ఒక్కరూ సంస్కృతి సంప్రదాయాన్ని తప్పకుండా పాటించాలని అన్నారు. విద్యార్థులకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణం చేయాలంటే అవస్థలు పడాల్సిందే

- **గుంతలుగా ఏర్పడిన రోడ్డు**



**ఆర్మూర్, విశాల భారతి** నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండల కేంద్రం నుండి బజారు కొత్తూరు మీదుగా మాయాపూర్, ఉమ్మెడ, బాద్గుణ గ్రామాల వాహనదారులు ప్రయాణం చేయాలంటే అవస్థలు పడాల్సిందే అన్నట్లుగా రోడ్డు దుస్థితి ఉంది. ఉమ్మెడ, మాయాపూర్, బాద్గుణ ప్రధాన రోడ్డు వెంబడి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. కొంత మేరకే మరమ్మత్తులు దాదాపు ఐదు నెలల క్రితం పనులు చేశారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన మరమ్మత్తులు చేసిన రహదారి పూర్తిగా ధ్వంసమై అక్కడక్కడ గుంతలు,గుంతలు గా ఏర్పడ్డవి. గతంలో ఇట్టి గుంతలను ఆటో యూనియన్ సభ్యులు స్వచ్ఛందంగా పూడ్చి వేశారు. ఈ రహదారి వెంబడి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రోడ్డు వెంబడి నిత్యం తరుచూ ప్రమాదాలు జరుగుతున్నవి.. అయితే కొందరు మృత్యువాత పడ్డారు. గాయాల పాలైనవారు ఉన్నారు. రోడ్డు మార్గాలను సూచించే సూచికలను ఏర్పాటు చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు. ఉమ్మెడ మీదుగా లోకేశ్వరం ఆదిలాబాద్ జిల్లాకు ప్రయాణం చేసే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని ఆయా గ్రామాల వాహనదారులు కోరుతున్నారు.

**కిషన్ నాయక్ పంచాయతీరాజ్ డిఇ:**
బీటీ రెన్యువల్ కోసం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. మంజూరు రాగానే తొందరలోనే టెండర్లు వేసి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభిస్తాం. అదేవిధంగా నాణ్యతతో పనులు చేయడం జరుగుతుంది అని అన్నారు.




## పౌష్టికాహారంతోనే ఆరోగ్యానికి మేలు

**శాలిగౌరారం ,విశాలభారతి:** పౌష్టికాహారం తోనే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని శాలిగౌరారం మండల వైద్యాధికారి డాక్టర్ సూర్య శిల్ప అన్నారు. శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 9వ వారం గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్య శిల్ప మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు నెల నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకొని పుష్టికరమైన పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యాంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో పౌష్టికాహార దాతలు మద్ది హరినాథ్ రెడ్డి, మద్ది వెంకటరెడ్డి సునిత దంపతులు, పిహెచ్ఎన్ రాములమ్మ,సూపర్ వైజర్లు దయామణి, మరియా,సీనియర్ అసిస్టెంట్ కంచర్ల జగన్నాధరెడ్డి, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ సభ్యులు దునక వెంకన్న, దామెర్ల శ్రీనివాస్, క్లబ్ కోశాధికారి వడ్లకొండ బిక్షం, ఎఎన్ఎం లు, ఆశా వర్కర్లు వివిధ గ్రామాల గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.



## ఆట పాటలతో బతుకమ్మ వేడుకలు

**కరకగూడెం, విశాలభారతి:** మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంగిలి పువ్వుతో మొదలై తొమ్మిది రోజులు జరిగే తెలంగాణ అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ. తెలంగాణ ఆడపడుచులకు అత్యంత ఇష్టమైనది. ఈ పండుగ నేపథ్యంలో కరకగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్, బట్టుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాల లలో దసరా సెలవులు ఉండడంతో పాఠశాల పని దినాలలో చివరి రోజైన మంగళవారం విద్యార్థులు బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో డీజే పాటలతో నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో స్రవంతి, సుజాత, గౌసియా బేగం, లక్ష్మణ్, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.




## మాతా శిశు ఆస్పత్రి నిర్వాకం

- **మందుల కొరతతో శిశు గర్భిణీలు అగచాట్లు**
- **గర్భిణీలకు, పసికందులకు కనీసం సదుపాయాలు కూడా లేని పరిస్థితి**

**కొత్తగూడెం, విశాలభారతి:** తెలంగాణ ప్రభుత్వం ఆసుపత్రుల్లో పేదలకు వైద్యంఅందించాలని లక్ష్యం నీరు కారిపోతుందా. వైద్యం ఏమో కానీ సమయానికి మందులు కూడా అందుబాటులో ఉండడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే సామాన్యులు మందులు ప్రైవేట్ మెడికల్ షాపులో కొనడమైన గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ ప్రైవేట్ లో చేయించమని నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో రామవరం ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రి నిర్వాకం, ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందకపోగా మందుల కొరతతో శిశు గర్భిణి అగచాట్లు పడుతున్న వైద్య పరీక్షలకు స్కానింగ్ ఈసీజీ సంబంధించిన సరైన వసతులు కూడా లేకుండా కూలి, నాలి చేసుకుని సామాన్యులకు డాక్టర్ రాసే చిట్టి మందుల కౌంటర్లు చూస్తే లేని మందులు రాసి సామాన్యులకు భారంగా మారుస్తున్నారు. వైద్యం చేయించాక మందుల కోసం కౌంటర్ కు వెళితే చేదు అనుభవం ఎదురవుతుంది రాసిన మందులు అందుబాటులో ఉండకపోవడం సామాన్యులు ఏమి తోచని స్థితిలో ఉండిపోతున్నారు. సామాన్యులు కొనలేని మందులు ప్రైవేటు షాపులో ఎక్కువ ఖరీదు కొనుగోలు చెయ్యలేక అనారోగ్యంతో బాధపడుతున్నారు. జిల్లాలోని రామవరంలో ఉన్న 100 పడకల మాతా శిశు హాస్పిటల్, ఫిబ్రవరి 2019 లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎంపీగా శంకుస్థాపన చేశారు. ఈ హాస్పిటల్ సరైన మందులు మరియు సరైన సదుపాయాలు కూడా లేకుండా చిన్నారులు మరియు గర్భిణీ స్త్రీలు ఇబ్బంది పడుతున్నారు. ఈసీజి స్కానింగ్ ఉన్నా కూడా తీయకుండా ప్రైవేట్ లో తీసుకోవాలంటూ సూచిస్తున్నారు. సరైన డాక్టర్లు లేక గర్భిణీలను పసికందులకు కనీసం సదుపాయాలు కూడా లేకపోవడం దౌర్భాగ్య స్థితి. ప్రతి రోజు జిల్లా మొత్తం మీద నుండి 100 నుండి 1000 మంది వరకు ఈ మాతా శిశు హాస్పిటల్ కి వస్తూ ఉంటారు. ఈ సామాన్యులు ఈ ఖర్చును ఎలా భరిస్తారు, ప్రభుత్వం సంవత్సరానికి వేలకోట్లు బడ్జెట్లో పెడుతున్న ఎక్కడికి పోతున్నాయి అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక

- **ప్రిన్సిపాల్ పి మల్లయ్య**

**తుంగతుర్తి, విశాలాభారతి:** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని శ్రీ విద్యా భారతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి ఉన్నత పాఠశాలలో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిని పూజించే గొప్ప సాంప్రదాయం తెలంగాణ సొంతమని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేనివిధంగా పూలను పూజిస్తామని తెలిపారు. ఆడపడుచులు అందరూ సంతోషంగా జరుపుకునే పెద్ద పండుగ బతుకమ్మ అని, బతుకమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి బతుకమ్మ పాటలకు ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వెంకటగోపాల్, నజీరుద్దీన్, ఉపాధ్యాయ బృందం రమేష్,లింగమూర్తి, సురేష్, ఈరోజీ, సరిత, స్వప్న, రాధ, ఉమ, అనిత, సునీత తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ క్రాప్ సర్వేపై నిరసన వ్యక్తం చేసిన వ్యవసాయ అధికారులు

**పినపాక, విశాలభారతి:** 49రకాల విధులు నిర్వహిస్తూ అష్టకష్టాలు పడుతుండగా తాజాగా క్రాప్ సర్వే భారాన్ని మోపడం ఏమిటని ఏవో వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం పినపాక రైతు వేదిక వద్ద డిజిటల్ క్రాప్ సర్వేపై వ్యవసాయ విస్తరణాధికారులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మాట్లాడుతూ తాము పనిభారంతో సతమతం అవుతున్నామని, తమ క్లస్టర్ల పరిధిలో ఉండే భూముల వద్దకు వెళ్లి సర్వే చేసేందుకు సమయం సరిపోదని, చాలా రిస్కుతో కూడుకున్న పని అని వాపోయారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని పంటలను సర్వే చేయడం ఒక ఏఈవోతో సాధ్యమయ్యే పని కాదన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల ఏఈవోలు పాల్గొన్నారు.



## కార్పెంటర్స్ కు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- బీసీ నేత ధనుంజయ నాయుడు విజ్ఞప్తి

**పాలకీడు, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో కార్పెంటర్స్ కు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయ నాయుడువిజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉమ్మడి నేరేడుచర్ల మండలాలకు చెందిన కార్పెంటర్ సమావేశంలో మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ కేవలం చేతి వృత్తిని నమ్ముకొని ఎలాంటి ఆస్తులు లేక కనీసం సొంత ఇండ్లు లేక అనేకమంది కార్పెంటర్స్ ఆర్థిక బాధలు ఎదుర్కొంటున్నారని, ఆర్థిక బాధలు ఎదుర్కొంటున్న కార్పెంటర్స్ ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, 50 సంవత్సరాలు నిండిన అనేకమంది కార్పెంటర్లకు సరిగా కళ్ళు కనిపించక, పనిచేయలేక పోతున్నారని అన్నారు. అందుకొరకు వారికి నెలకు 5 వేల రూపాయల పెన్షన్ అందించాలని, అందరికీ డిజిటల్ ఆరోగ్య కార్డులు అందించి ఆదుకోవాలని, పట్టణ ప్రాంతాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇండ్లు లేని కార్పెంటర్లను గుర్తించి అందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, కార్పెంటర్ కుటుంబాల్లోని పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలని, చదువు ఉండి అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కింద బ్యాంకులతో సంబంధం లేకుండా రుణాలు అందించాలని ఆయన కోరారు. సమావేశానికి తునికి పాటి మల్లాచారి అధ్యక్షత వహించగా, నాయకులు బొడ్డుపల్లి సుందరయ్య, తునికిపాటి జగన్నాథ చారి, సూరోజు వెంకటేశ్వర్లు, వజ్రాల లింగాచారి పాల్గొన్నారు.



## కదం తొక్కిన భవన కార్మికులు

- కార్మిక వెల్ఫేర్ బోర్డును ఎల్ఐసికి అప్పగించవద్దు
- సిఐటియులో చేరిన బాపూజీ సంఘం సభ్యులు

**ఆమనగల్లు, విశాల భారతి::** భవన నిర్మాణ కార్మిక సంఘ కార్మికులు మంగళవారం కదం తొక్కారు. కార్మిక వెల్ఫేర్ బోర్డును ఎల్ఐసికి అప్పగించవద్దని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి కాటంరాజు లు కోరారు. మంగళవారం ఆమనగల్లులో భవన కార్మిక సంఘం ఆమనగల్లు ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని ప్రధాన వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి భవన కార్మికుడు లేబర్ కార్డు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కార్మికులకు కూతురు పుడితే, కూతురు పెళ్లికి 30 వేల రూపాయలు చొప్పున ఇస్తుందని వాటిని లక్ష రూపాయలకు పెంచాలని కోరారు. కార్మికుడు మరణిస్తే ఇచ్చే 6.30 లక్షల రూపాయలను 10 లక్షల పెంచాలని వారు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక చట్టాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సందర్భంగా బాపూజీ సంఘం సభ్యులు సిఐటియు చేరారు. కార్యక్రమంలో ఏరియా కమిటీ అధ్యక్షులు పెంటయ్య, నాయకులు యాదయ్య, చంద్రబాబు, జహంగీర్, బ్రహ్మయ్య, లక్ష్మయ్య, ముస్తఫా, శ్రీనివాసులు పాల్గొన్నారు.



## పేద ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడేది కమ్యూనిస్టులే

- సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలర్పించిన చరిత్ర కమ్యూనిస్టులది
- ఈ దేశానికి కమ్యూనిస్టు విధానాలే ప్రత్యామ్నాయం
- కందగట్ల అనంత ప్రకాష్ సిపిఎం మండల కార్యదర్శి

**పాలకీడు, విశాలభారతి:** మండల కేంద్రంలో పాలకవీడు సిపిఎం శాఖా మహాసభ మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నికరంగా నిలబడి పోరాడేది ఎర్రజెండా సిపిఎం పార్టీ కమ్యూనిస్టులేనని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించే క్రమంలో జరిగిన పోరాటాలలో ప్రాణాలర్పించిన చరిత్ర కమ్యూనిస్టులదని ఆయన తెలిపారు. పాలకవర్గాలు రాజకీయాలను వ్యాపారమయంగా చేసి ప్రజలను గ్రామంలో ముంచేత్తుతూ పాలను కొనసాగిస్తున్నారని ఆయన వాపోయారు. నేటి రాజకీయాల్లో కార్పొరేట్ శక్తులు డబ్బున్న వారు ప్రవేశించి రాజకీయాన్ని ఒక వ్యాపార కేంద్రంగా మార్చుకుని,డబ్బుతో ఓటు కొని అధికారం వచ్చిన తర్వాత డబ్బులు కూడా పెట్టుకునే పనుల్లో అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కానీ కమ్యూనిస్టులు పదవులు ఉంటే పార్లమెంట్ అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై గళం ఇప్పుతారని పదవులు లేకున్నా బయట ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తారని తెలిపారు. మహాసభలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేష్,మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య, మాతంగి ఏసురత్నం, దాసరి సైదులు, పొదిల అంజి,పొదిల సైదులు,పాస్టర్ సైదులు, మీసాల మట్టయ్య,కుక్కడం వెంకటేశ్వర్లు, మీసాల సోములు, కొండా చిన్న ఎల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.




## సోయబీన్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

- మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

**బాల్కొండ, విశాల భారతి** వేల్పూర్ మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సోయబీన్ కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో సోయబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని,రైతులు పండించిన సోయను కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సంబంధిత అధికారులు తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి,సొసైటీ వైస్ చైర్మన్ శ్రీధర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్మారం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తాలు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం రవాణా టెండర్లు

- ఉమ్మడి జిల్లాలో ఒక రూల్.. వనపర్తికి మరో రూలా
- కొరవడిన కలెక్టర్ పర్యవేక్షణ
- రాచాల యుగంధర్ గౌడ్



**వనపర్తి, విశాల భారతి:** జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం రవాణా టెండర్లు కేటాయిస్తున్నారని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం రవాణా కోసం టెండర్లు ఆహ్వానించిందని, అయితే కొన్ని కారణాల వల్ల జిల్లాలోని కొత్తకోట, పెబ్బేరు సెక్టారుకు సంబంధించిన టెండర్లు రద్దు చేసి మళ్లీ రీ టెండర్లకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. దీనికి సంబంధించి కొత్తకోట సెక్టారుకు 2, పెబ్బేరు సెక్టారుకు 3 దాఖలు కాగా మంగళవారం వాటిని ఓపెన్ చేశారన్నారు. నిబంధనల ప్రకారం దాఖలు చేసిన వాహనాలకు సంబంధించిన పత్రాలను అడిషనల్ కలెక్టర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు సమక్షంలో రోడ్డు రవాణా అధికారి పరిశీలించాలన్నారు. కానీ ఫారం B 24 కు సంబంధించిన కొన్ని పత్రాలు నాగర్ కర్నూలు జిల్లా ఆర్టీవో ముద్ర వేసి ఇచ్చారని, కానీ సంతకం లేదన్న కారణంతో వనపర్తి ఆర్టీవో అభిప్రాయం తీసుకోకుండానే జిల్లా మేనేజర్ ఇర్ఫాన్ పెబ్బేరు ,కొత్తకోట సెక్టార్లకు సంబంధించిన ఒక్కో టెండర్ ఫారం రద్దు చేశారని మండిపడ్డారు. నాగర్ కర్నూలు,కల్వకుర్తి, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన పత్రాలు సమర్పిస్తే అక్కడ ఆమోదించారని, వనపర్తి జిల్లాలో మాత్రం ఎందుకు రద్దుచేశారో చెప్పాలన్నారు. కీలకమైన శాఖలపై కలెక్టర్ పర్యవేక్షణ కొరవడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా కొన్ని శాఖల అదికారులు మాత్రం బిఆర్ఎస్ నాయకుల ఒత్తిడికి తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఇర్ఫాన్ అవినీతి అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి నాయకులు రాఘవేందర్ గౌడ్, అంజన్న యాదవ్, మహిందర్ నాయుడు, శివ గౌడ్, మ్యాదరి రాజు, గ్రాడ్యుయేట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నల్లవెల్లి భరత్, గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్,తెలంగాణ విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## డిఎస్సి ఫలితాల్లో సత్తాచాటిన నవనీత



**బాల్కొండ, విశాల భారతి** తెలంగాణ ప్రభుత్వం ఇటివలే విడుదల చేసిన డీఎస్సీ 2024 ఫలితాల్లో భీమ్‌గల్ మండలం బడా భీంగల్ గ్రామానికి చెందిన మల్లురి నవనీత స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ ఓపెన్ కేటగిరీలో 11వ ర్యాంక్, అలాగే ఎస్సి కేటగిరీలో 2వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా మల్లురి నవనీత మాట్లాడుతూ తన విజయానికి భర్త మల్లురి ప్రమిత్ కుమార్, అమ్మ నాన్నలు, అత్త మామలు ప్రోత్సహించడం పట్ల ఈ ర్యాంక్ సాధించానని తెలిపారు.



## కాటన్ మిల్లు ఎన్నికల్లో సూర్య ప్రకాష్ ఘన విజయం

- ప్రత్యర్థి ఆనంద్ కుమార్ పై 68 ఓట్ల మెజార్టీ

**కల్వకుర్తి, విశాల భారతి** కల్వకుర్తి మండలం మార్చల గ్రామ పరిధిలోని కాటన్ మిల్లు అధ్యక్ష ఎన్నికలు మంగళవారం జరిగాయి. బిఆర్ఎస్ కె వి అభ్యర్థి అయినేని సూర్య ప్రకాశ్ రావు.. ప్రత్యర్థి ఐఎన్ టి యు సి అభ్యర్థి బృంగి ఆనంద్ కుమార్ పై 68 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 450 ఓట్లకు గాను 439 ఓట్లు పోల్ అయ్యాయి.సూర్య ప్రకాష్ రావు గెలుపు పట్ల కార్మికులు సంబరాలు చేసుకున్నారు. కాటన్ మిల్లు నుంచి భారీ ర్యాలీగా బాణాసంచా కాలుస్తూ కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్నగర్ చౌరస్తా, హైదరాబాద్ చౌరస్తా మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన కార్మికులకు సూర్య ప్రకాష్ రావు ధన్యవాదాలు తెలిపారు.



## నల్ల బ్యాడ్జీలతో వ్యవసాయ విస్తీర్ణ అధికారుల నిరసన

**వేల్పూర్, విశాల భారతి** కేంద్ర ప్రభుత్వం కొత్తగా డిజిటల్ క్రాప్ సర్వే పథకాన్ని ప్రవేశ పెట్టి వ్యవసాయదారుల పంటలను డిజిటల్ చేయాలని అన్ని రాష్ట్రాలలో ఆలంబించిన వైఖరిని తెలంగాణ రాష్ట్రంలో కూడా అదేవిధంగా అవలంబించాలని తెలుపుతూ వేల్పూర్ మండల కేంద్రంలోని వైశాఖ విస్తీర్ణ అధికారులు నల్లబాడ్జిలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పథకాన్ని వేరే రాష్ట్రాలలో ప్రైవేట్ సిబ్బంది నియమించుకొని డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలోనే వ్యవసాయ విస్తరణ అధికారులు చేయాలని ఒత్తిడి తీసుకురావడంతో పని భారం ఎక్కువ అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ఎడపల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా పనిచేసిన అనుభవంతో ఖరీఫ్ సీజన్లో డిజిటల్ సర్వే చేయడానికి 20 మందితో సర్వే చేస్తే 75 రోజుల సమయం తీసుకుందని యాసంగిలో పదిమందితో చేస్తే 90 రోజులను పట్టిందని ఈ విధంగా లెక్క తీసుకుంటే ఒక వ్యక్తి సర్వే చేయడానికి సుమారు 15 నెలల సమయం పడుతుందని పని భారం ఎక్కువై ఒత్తిడి గురవుతామని వాపోతున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రుణమాఫీ విధివిధానాలు ఖరారు చేయడానికి వ్యవసాయ అధికారులకు పని భారం పెంచి అదనపు భారం పడిందని మళ్లీ ఇప్పుడు మా పై కనికరం లేకుండా డిజిటల్ సర్వే చేయాలని చెప్పడం ఎంతవరకు సబమని వారు అంటున్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు స్నేహ శ్రీ వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి



**నడిగూడెం, విశాలభారతి:** గుండెపోటుతో మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన అమరగాని శ్రీను మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందరితో కలివిడిగా ఉండే అమరగాని శ్రీను గుండెపోటుతో అకాల మరణం చెందటం పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య ఉపేంద్ర కుమారుడు శశి కుమార్తె తేజస్విని ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



## అంబరాన్నాంటిన బతుకమ్మ సంబరాలు

**ఆమనగల్లు, విశాలభారతి :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ సంబరాలు ఆమనగల్లు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ముందస్తు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. సంబరాలను పురస్కరించుకొని విద్యార్థినిలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చుకొని పాఠశాలకు తీసుకువచ్చారు. పాఠశాల మైదానంలో బతుకమ్మలను పెట్టి విద్యార్థినిలు, ఉపాధ్యాయురాల్లు ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను కౌన్సిలర్ లక్ష్మణ్ సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయురాల్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు విజయలక్ష్మి, స్వాతి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఉపాధ్యాయుడైన వేళ!

- కిన్నెర మధును సన్మానించిన గురువు కత్తి వెంకటేశ్వర్లు

నడిగూడెం, విశాలభారతి: తను చదువు చెప్పిన పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థి ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా కిన్నెర మధును గురువు కత్తి వెంకటేశ్వర్లు ఘనంగా శాలువాతో సన్మానించారు. మండలంలోని కొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు మాదిగ మండలంలోని ఏక్లాస్ ఖాన్ పేట గ్రామంలో 1998 లో తను ఉపాధ్యాయడీగా పనిచేసిన సమయంలో పాఠశాలలో విద్యనభ్యసించిన కిన్నెర మధు ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలో 76 మార్కులు సాధించి హెచ్ జి టి విభాగంలో ఓపెన్ క్యాటగిరిలో 48 ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిన్నెర మధు నిరుపేద కుటుంబానికి చెందిన వారని చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో తల్లి ఎన్నో కష్టాలకు వచ్చి కొడుకుని ఉన్నత ఉన్నత విద్యను అభ్యసించేందుకు కృషి చేసిందని ప్రాథమిక విద్య ఏక్లాస్ ఖాన్ పేటలో హైస్కూల్ స్థాయి విద్యను తెల్లబెల్లిలో గ్రామంలో ని ప్రభుత్వ పాఠశాల విద్యను భ్యసించారని చిన్నతనం నుండి మంచి క్రమశిక్షణ గల విద్యార్థిగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మస్రం శ్రీనివాసరావు ఉపాధ్యాయులు శోభన్ బాబు, మేరాజుద్దీన్, మౌలానా, చారి, పర్వతాలు అశోక్, వెంకటేశ్వర్లు, శ్రీదేవి అహల్య, లలిత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు దుర్గాష్టమి ఉత్సవాలు

**నూతనకల్, విశాలభారతి:** మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు దుర్గాష్టమి, విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులచే దుర్గామాత అవతారాలను తెలియజేసే వేషధారణలను వేసి ప్రదర్శించడంతో పాటు రావణాసురుని వధ, మహిషాసురుని వధ, వంటి రూపకల్పన దృశ్యాలను ప్రదర్శింప చేశారు.అనంతరం చిన్నారులచే బొమ్మల కొలువు ఏర్పాటు చేయడంతో పాటు రంగురంగుల పువ్వులచే బతుకమ్మలను పేర్చి గౌరీమాతను నెలకొల్పి పాఠశాల ప్రాంగణంలో కోలాటాలు వేస్తూ ఉయ్యాలలు ఊగారు.ఈ ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలతో పాటు,తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసే దిశగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మారగాని విజయలక్ష్మి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గుర్రం యాదగిరి గౌడ్,బిక్కి రామన్న గౌడ్,మతిన్, యశ్వంత్,రాజేశ్వరి,సౌమ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




## దసరాలోగా రైతుబంధు, పాల బిల్లులు చెల్లించకుంటే మహా ధర్నా

- అమలు కాని హామీలతో ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్

**ఆమనగల్లు, విశాలభారతి :** దసరా పండుగలోగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతుబంధు, పెండింగ్ రైతు బీమా, పాల బిల్లులు చెల్లించకుంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తామని మాజీ జెడ్పిటిసి దశరథ నాయక్ చెప్పారు. మంగళవారం కడ్తాల్ లో మాట్లాడుతూ అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతుల నడ్డి విరుస్తుందని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ పూర్తయి రబీ పంటలు ప్రారంభమైన నేటికీ రైతుబంధు ఇవ్వలేదని, మృతి చెందిన రైతులకు బీమా అందించలేదని, పాడి రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి, రైతు కోఆర్డినేటర్ వీరయ్య, డైరెక్టర్ సేవ్య,గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు మంగళపల్లి నరసింహ, వెంకటేష్, పాండు నాయక్, ముత్యాలు, అంజి, బిక్షపతి,భీమన్, మహేష్, లక్ష్మణ్, శ్రీను,రాజు,శ్రీకాంత్, మల్లేష్నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి సన్మానం



**వేల్పూర్, విశాల భారతి** బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని పి ఆర్ టి యు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం నూతనంగా ఏర్పడిన పి ఆర్ టి యు కార్యవర్గాన్ని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి అధ్యక్షులు దేవానందం పరిచయం చేశారు. అలాగే నూతనంగా వేల్పూర్ మండలానికి విద్యాధికారిగా వచ్చిన రేణుకను ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా లక్కోరా వేల్పూర్ పాఠశాలల్లో నూతన నిర్మాణం గురించి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు ప్రధాన కార్యదర్శి నరసింహ రావు, మండల విద్యాధికారి రేణుక, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హరిచరణ్, కాంతయ్య, దేవరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, రవీందర్, జిల్లా కార్యదర్శి నంబి శ్రీనివాస్, మండల అసోసియేట్ అధ్యక్షులు రాజేంద్ర, మహిళా ఉపాధ్యక్షులు శైలజ, అంజలి, రాకేష్, ప్రధానోపాధ్యాయులు రాజన్న ఉపాధ్యాయులు ప్రభాకర్, గంగాధర్, ఝూన్సీ, తదితరులు పాల్గొన్నారు.



## 'గేమ్ చేంజర్'లో ఆయన్ని సరికొత్తగా డిఫరెంట్ డైమన్షన్‌లో చూస్తారు

**: స్టార్ డైరెక్టర్ శంకర్**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్. 2024 క్రిస్మస్ సందర్భంగా సినిమాను తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోన్న ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'రా మచ్చా మచ్చా..' సాంగ్‌ను సెయింట్ మార్టిన్స్ కాలేజ్‌లో స్టూడెంట్స్ సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా.. చిత్ర నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "'గేమ్ చేంజర్' ప్రమోషన్స్ ఈ కాలేజ్ నుంచే స్టార్ట్ చేశాం. జెంటిల్‌మేన్ నుంచి శంకర్‌గారు డైరెక్ట్ చేసిన అన్నీ సినిమాలు నాకు ఇష్టమే. ప్రతీ సాంగ్‌ను ఆయన ఎంతో స్పెషల్‌గా తెరకెక్కిస్తుంటారు. 'గేమ్ చేంజర్'లోనూ ఐదు పాటలను ఐదు రకాలుగా విజువలైజేషన్ చేశారు. మరో మూడు అద్భుతమైన పాటలు రానుంది. ట్రిపులార్ తర్వాత రామ్ చరణ్ చేసిన 'గేమ్ చేంజర్'ను క్రిస్మస్ సందర్భంగా విడుదల చేస్తున్నాం" అన్నారు. స్టార్ డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ "నేను డైరెక్ట్ చేసిన ప్రతీ సినిమాను తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. అలాంటి ప్రేక్షకుల కోసం ఓ స్ట్రయిట్ మూవీ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. ఇప్పుడు 'గేమ్ చేంజర్' రూపంలో అది నేరవేరుతుంది. దిల్‌రాజు, శిరీష్‌గారి నిర్మాతలుగా ఈ మూవీ తెరకెక్కుతుంది. పక్కా తెలుగు సినిమాలా ప్రతి విషయంలో కేర్ తీసుకుని ఎంతో జాగ్రత్తగా దీన్ని తెరకెక్కించాను. సాంగ్స్ విషయానికి వస్తే నేను హీరో ఇంట్రడక్షన్ సాంగ్ ఏ సినిమాలోనూ చేయలేదు. కానీ తొలిసారి 'గేమ్ చేంజర్'లో అలాంటి హీరో ఇంట్రో సాంగ్ చేశాను. తెలుగు సంస్కృతిని చూపించటానికి 1000 మంది జానపద కళకారులతో పాటను చిత్రీకరించాం. తమన్‌గారు రెండు రోజులు అన్నీ ట్యూన్స్‌ను రికార్డ్ చేసి ఈ పాటను తమన్‌గారు చేయటం విశేషం. రామ్ చరణ్‌గారిని సరికొత్తగా డిఫరెంట్ డైమన్షన్స్‌లో చూడొచ్చు. ఆయన మంచి డాన్సర్. పెర్ఫామర్. ఆ సాంగ్‌లో అద్భుతంగా డాన్స్ చేశారు. ఈ సాంగ్‌లో ఒక నిమిషం పాటు వచ్చే బీజీఎంను ఆయన సింగిల్ టేక్ డాన్స్‌తో పూర్తి చేశారు. మేకర్స్ అన్‌కాంప్రమైజ్డ్‌గా సినిమాను నిర్మించారు. దిల్‌రాజు, శిరీష్‌గారికి స్పెషల్ థాంక్స్. శ్రీకాంత్‌గారు ఫస్ట్ టైమ్ ఓ డిఫరెంట్ రోల్‌లో కనిపిస్తారు. ఎస్.జె.సూర్య నట రాక్షసుడు. చరణ్, సూర్య మధ్య సన్నివేశాలను ఎంతో బాగా ఎంజాయ్ చేస్తారు. అనంత్ శ్రీరామ్‌గారు పాటను అద్భుతంగా రాశారు. ఈ పాటను రేపు స్క్రీన్‌పై చూస్తున్నప్పుడు నోస్టాలజిక్ ఫీలింగ్ వస్తుంది" అన్నారు.



## నవంబర్ 14న 'మట్కా'

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హైలీ యాంటిసిపేటెడ్ పీరియడ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మట్కా' షూటింగ్ చివరి దశలో ఉంది. ప్రస్తుతం, టీమ్ వరుణ్ తేజ్, ఫైటర్స్‌తో కూడిన చాలా కీలకమైన, ఇంటెన్స్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తోంది. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న 'మట్కా' వరుణ్ తేజ్‌కి మోస్ట్ హై బడ్జెట్ మూవీ. ప్రొడక్షన్ చివరి దశలో వుండటంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంగా జరగడంతో 'మట్కా' మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రం కార్తీక పూర్ణిమకు ముందుగా నవంబర్ 14న థియేటర్లలోకి రానుంది, సినిమాకి లాంగ్ వీకెండ్ అడ్వాంటేజ్ వుంటుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ తో అదరగొట్టిన మేకర్స్ సెకండ్ లుక్ రిలీజ్ చేశారు. వరుణ్ తేజ్ పోస్టర్‌లో రెట్రో అవతార్, సూట్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లపై నడుస్తున్న పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కరుణ కుమార్ పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను రాసారు. 1958, 1982 వరకు 24 సంవత్సరాల పాటు సాగే పీరియడ్ బ్యాక్‌డ్రాప్‌ని ఎంచుకున్నారు. వరుణ్ తేజ్‌ని నాలుగు డిఫరెంట్ అవతార్స్ లో అద్భుతంగా చూపిస్తున్నారు. ఇప్పటికే ఫస్ట్ లుక్, వర్కింగ్ స్టిల్స్ లో వరుణ్ తేజ్ వైవిధ్యమైన లుక్స్ అదరగొట్టాయి.

## 'సత్యం సుందరం'ని ఇంత మంచి సక్సెస్ చేసిన మీడియా : హీరో కార్తి



హీరో కార్తీ, అరవింద్ స్వామి లేటెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ 'సత్యం సుందరం'. 96 ఫేమ్ సి ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో, 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సూర్య, జ్యోతిక ఈ చిత్రాన్ని నిర్మించారు. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్ గా రిలీజ్ చేశారు. సెప్టెంబర్ 28న ప్రేక్షకులు ముందుకు వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులు, విమర్శకుల ప్రసంశలు అందుకోని యునిమాస్ బ్లాక్ బస్టర్ విజయంతో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా టీం సక్సెస్ మీట్ ని నిర్వహించింది. సక్సెస్ మీట్ లో హీరో కార్తీ మాట్లాడుతూ.. ఇది సక్సెస్ మీట్ లా లేదు ఫ్యామిలీ ఫంక్షన్ లా వుంది. మీరంతా ఎంతో ప్రేమతో అప్రిషియేట్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. మంచి సినిమాలు చేసినప్పుడు అప్రిషియేట్ చేస్తారు. కానీ 'సత్యం సుందరం'కు ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ కొత్త అనుభూతిని ఇచ్చింది. ఇంత ప్రేమని ఇస్తున్న అందరికీ థాంక్ యూ. మీరు చూపించిన లవ్ కి చాలా ఎమోషనల్ అయ్యాను. ముందుగా కే విశ్వనాథ్, బాలచందర్, కమల్ హాసన్, దాసరి గారు లాంటి గొప్పవారికి థాంక్స్ చెప్పాలి. ఇలాంటి సినిమా మనికి చిన్నప్పుడే చూపించారు. ఈ కైండ్ అఫ్ సినిమాని మనలోపల పెట్టారు. అందుకే సినిమాని యాక్సప్ట్ చేయడం జరిగింది. కొత్త సినిమాలు చేస్తే తప్పకుండా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకాని ఈ సినిమా మరోసారి రుజువుచేసింది. అన్ కండీషనల్ లవ్ ని ప్రేక్షకులు చూస్తారని ఈ సినిమాతో మరోసారి ప్రూవ్ అయ్యింది. ఈ సినిమా విజయం ఇలాంటి మరిన్ని సినిమాలు చేయాలనే నమ్మకాన్ని ఇచ్చింది. ఇలాంటి ఎమోషన్స్ జీవితంలో మిస్ అవుతున్నాయని, మళ్ళీ ఆ ఎమోషన్ ని తీసుకొచ్చారని ఆడియన్స్ చెప్పినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఇలాంటి స్క్రిప్ట్ రాయాలంటే లోపల అంత ప్రేమ వుండాలి. డైరెక్టర్ ప్రేమ్ కుమార్ గారికి థాంక్ యూ. 96లో ఎలా ప్రేమించాలో చెప్పారు. ఇందులో అన్ కండీషనల్ లవ్ అంటే చూపించారు. అన్నయ్య ఈ కథ విన్న వెంటనే నువ్వు చేయాలని చెప్పారు. ఇది అప్రిషియేషన్స్ తో స్టాప్ అవ్వకూడదు. కమర్షియల్ గా కూడా పెద్ద హిట్ అవ్వాలి. అప్పుడే మాత్రమే నిర్మాతలు ఇలాంటి సినిమాలు తీసుకొస్తారు. ఈ సినిమా నా కోసం కాదు మంచి సినిమా కోసం చూడాలని ప్రేక్షకులని కోరుకుంటున్నాను. చిన్న విషయాలని అప్రిషియేట్ చేయాలని ఒక జనరేషన్ కి ఈ సినిమా ద్వారా చూపించాం. శ్రీదివ్య చేసిన ప్రతి సీన్ కి క్లాప్స్ పడ్డాయి. చాలా పెద్ద పెద్ద ఆర్టిస్టులు ఈ సినిమాని ప్రేమతో చేశారు. ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులు థాంక్ యూ' అన్నారు.



## శ్వాగ్ నా కెరీర్ లో వన్ అఫ్ ది టాప్ సినిమాగా నిలుస్తుంది

**: హీరో శ్రీవిష్ణు**

కింగ్ ఆఫ్ కంటెంట్ శ్రీవిష్ణు, ట్యాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి అప్ కమింగ్ హిలేరియస్ ఎంటర్ టైనర్ 'శ్వాగ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రీతూ వర్మ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. శ్వాగ్ అక్టోబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో శ్రీవిష్ణు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు. శ్వాగ్.. అంటే శ్వాగనిక వంశానికి సుస్వాగతం. అంత పెద్ద టైటిల్ ని పలకడానికి ఇబ్బందిగా ఉంటుందని షార్ట్ గా 'శ్వాగ్' అని టైటిల్ పెట్టాం. శ్వాగ్ ఒక వంశానికి సంబధించిన కథ. మాతృ, పితృస్వామ్యం అనే క్లాష్ నుంచి 1500 సంవంత్సవంలో మొదలయ్యే కథ. మగ గొప్పా ? ఆడ గొప్పా ? అనే అంశంపై చిన్న టిట్ ఫర్ టాట్ లాంటి కథ. తెలుగు ప్రేక్షకులు కొత్త కథ ఎప్పడు చెప్పినా ఆదరించారు. అదే ధైర్యంతో ఈ సినిమా చేయడం జరిగింది. నేను ఎప్పడూ డ్యుయల్ రోల్స్ చేయలేదు. ఇందులో నాలుగు పాత్రలు చేశాను. అందరూ ఒకే పోలికతో వుండే ఒకే వంశస్తులే. నాలుగు పాత్రలు వున్నప్పడు ఎలా చేయాలనేది ఛాలెంజ్ గా అనిపించింది. వన్స్ గెటప్స్ అన్నీ సెట్ అయ్యాక.. చాలా బాగా కుదిరింది. సినిమా చాలా బావొచ్చింది. ఇంటిల్లిపాది చూడదగ్గ సినిమా ఇది. పెద్దవాళ్ళకి సినిమా విపరీతంగా నచ్చుతుంది. అలాగే యంగ్ ఆడియన్స్ కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ సినిమాలో వున్నాయి. సినిమా చూసి పేరెంట్స్ ని కూడా సినిమాకి తీసుకువెళ్తారు. ఈ జనరేషన్ తెలుసుకోవాల్సిన చాలా విషయాలు ఇందులో వున్నాయి. మన వంశం గురించి, పెద్దల గురించి, తాతల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏమిటనేది ఇందులో చాలా చక్కగా చూపించడం జరిగింది. చాలా పెద్ద కథ ఇది. రెండున్న గంటల్లో ఇంత పెద్ద కథ చెప్పారా అని సినిమా చూసిన తర్వాత దర్శకుడిని ప్రేక్షకులు అభినందిస్తారు. కథలో బాగంగానే ఎంటర్టైన్మెంట్ వుంటుంది. అందరి ఆడియన్స్ కి ఈ సినిమా తప్పకుండా నచ్చుతుంది. నా కెరీర్ లో ఈ సినిమా వన్ అఫ్ ది టాప్ ఫిల్మ్ గా నిలుస్తుందనే నమ్మకం వుంది. రాజ రాజ చేస్తున్నప్పడు సెకండ్ సినిమా చేద్దామని ఫిక్స్ అయ్యాం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కూడా మీరు ఎప్పడు ఫ్రీ అయితే అప్పడు ప్రాజెక్ట్ చేసుకోమని చెప్పారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మమ్మల్ని నమ్మి రాజరాజ చోర సినిమా ఇచ్చింది. చాలా సపోర్ట్ చేశారు. ఈ సినిమా ఖచ్చితంగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కి మంచి సక్సెస్ అవుతుంది. మీరా జాస్మిన్ గారు చాలా అద్భుతంగా చేశారు. 90లో మదర్ లాంటి క్యారెక్టర్. ఆ క్యారెక్టర్ ని చూసినప్పడు అందరి మదర్స్ గుర్తుకు వస్తారు. ఆ పాత్ర చాలా హుందాగా హోమ్లీ గా వుంటుంది. యునానిమస్ గా అందరికీ నచ్చుతుంది.

## 'స్వయంభూ'పైనే నభా నటేష్ ఆశలు..!

నభా నటేష్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. వజ్రకాయ మూవీతో సినీరంగ ప్రవేశం చేసింది కన్నడ బ్యూటీ. నన్ను దోచుకుందువటే మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. సుధీర్ బాబు హీరోగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో వచ్చిన చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధించింది. ఆ తర్వాత పూరీ దర్శకత్వంలో ఇస్మార్ట్ శంకర్ మూవీలో నటించిన నభాకు గుర్తింపే వచ్చింది. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలతో దూసుకెళ్లింది. తెలుగులో 2021లో మాస్ట్రో మూవీలో కనిపించిన బ్యూటీ ఆ తర్వాత హఠాత్తుగా తెరపై నుంచి కనుమరుగైంది. అయితే, 2022లో రోడ్డు ప్రమాదంలో గాయపడింది. దాంతో దాదాపు రెండేళ్ల పాటు సినిమాలకు దూరం కావాల్సి వచ్చింది.మళ్లీ ఈ ఏడాది డార్లింగ్ మూవీతో మళ్లీ తెరంగేట్రం చేసింది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బోల్తాకొట్టింది. ప్రస్తుతం తెలుగులో నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా వస్తున్న 'స్వయంభూ' మూవీలో ఛాన్స్ కొట్టేసింది. ఈ మూవీతో మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నది. స్వయంభూలో మరో హీరోయిన్‌గా సంయుక్త సైతం నటిస్తున్నది. నభా చేసింది కొద్ది సినిమాలే అయినా యూత్‌లో క్రేజీ హీరోయిన్‌గా నిలిచింది. పూరీ జగన్నాథ్, రామ్ పోతినేని కాంబినేషన్లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ మూవీతో ఓవర్‌నైట్ స్టార్‌గా చేసింది. తెలుగులో ఇప్పటి వరకు ఎనిమిది చిత్రాల్లో నటించినింది. అయితే, ఇందులో ఇస్మార్ట్ శంకర్, నన్నుదోచుకుందువటే సినిమా మినహా మిగతా సినిమాలు పెద్దగా గుర్తింపును తీసుకురాలేకపోయాయి. ప్రస్తుతం కన్నడ బ్యూటీ కేవలం 'స్వయంభూ' మూవీపైనే భారీ అంచనాలు పెట్టుకున్నది. ఈ మూవీతో కెరీర్‌ను గాడిలో పెట్టుకోవాలని చూస్తున్నది. మరో వైపు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ హాట్ ఫొటోషూట్లతో అభిమానులకు దగ్గరగా ఉంటున్నది.





## "కలి" మూవీ నుంచి రొమాంటిక్ మెలోడీ సాంగ్ రిలీజ్

యంగ్ హీరోలు ప్రిన్స్, నరేష్ అగస్త్య నటిస్తున్న సినిమా "కలి". ఈ చిత్రాన్ని ప్రముఖ కథా రచయిత కె.రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో "రుద్ర క్రియేషన్స్" సంస్థ నిర్మిస్తోంది. శివ శేషు రచించి దర్శకత్వం వహిస్తున్నారు. లీలా గౌతమ్ వర్మ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సైకలాజికల్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిన ఈ సినిమా ఈ నెల 4న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "కలి" మూవీ నుంచి రొమాంటిక్ మెలోడీ సాంగ్ 'హల్లో హల్లో..' ను రిలీజ్ చేశారు మేకర్స్. 'హల్లో హల్లో..' పాటకు సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి బ్యూటిఫుల్ లిరిక్స్ అందించగా, జీవన్ బాబు (జె.బి.) ప్లెజెంట్ ట్యూన్ తో కంపోజ్ చేశారు. హైమత్ హైమత్ అహ్మద్, అదితీ భావరాజు మంచి ఫీల్ తో పాడారు. 'హల్లో హల్లో హల్లో పూలదారుల్లో పాదం వేద్దాం ఓ పిల్లో, ఛల్లో ఛల్లో ఛల్లో రంగు రంగుల్లో జీవించేద్దాం ఛల్ ఛల్లో, కలవని దూరం దూరం నిన్న వరకు, అడుగులో అడుగేసేద్దాం చివరి వరకు...'అంటూ రొమాంటిక్ గా సాగుతుంది పాట. ఈ సైకలాజికల్ థ్రిల్లర్ కథకు 'హల్లో హల్లో..' పాట కలర్ ఫుల్ పిక్చరైజేషన్ తో కొత్త ఫ్లేవర్ తీసుకొస్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.